
www.andhrajyothy.com



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 18-1-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 289 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ. 2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.50-12.37; దుర్ముహూర్తం: ఉ. 6.52-8.21; అమృతఘడియలు: ఉ. 7.53-9.37; రాహుకాలం: ఉ. 9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | అనంతపురము సిటీ**


Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



29వ వర్ధంతి
నా పరిపూర్ణ, పరిశుద్ధ హృదయంతో..
నిను కొల్చు భాగ్యం ఇంకెప్పుడూ..
ప్రభూ... ఈ జన్మకూ...
BOMMARILLU
ఆయన వీరాభిమాని
"బొమ్మరిల్లు వారి" సంస్థ అధినేత
వై.వి.ఎస్. చౌదరి


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
KING OF SANKRANTI
A BOBBY KOLLI FILM
డాకు మహారాజ్
SURYADEVARA NAGA VAMSI - SAI SOUJANYA
A THAMAN S MUSICAL
ADITYA


MAHAAKAAL PICTURES
TRAILER OUT NOW
IN CINEMAS FROM
24th JAN
హాత్య
DIRECTOR SRIVIDYA BASAWA PRODUCER S PRASHANTH REDDY


GOKULAM GOPALAN
RAGAM MOVIES
MOVIE MAXX
SREENIWAAS MANDALA
SVM
SRI VEDAASHARA MOVIES
CHINTHAPALLI RAMARAO
TOVINO THOMAS
IDENTITY
తెలుగులో
2025 లో విడుదలైన తొలి మలయాళ సూపర్ హిట్ చిత్రం 40 కోట్లు వసూలు చేసి తెలుగులో యాక్షన్ థ్రిల్లర్ మూవీగా విడుదలవుతోంది.
WRITTEN & DIRECTED BY AKHIL PAUL – ANAS KHAN
PRODUCER RAJU MALLIATH DR ROY C J
24TH JAN 2025


SMT.ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
GLOBAL STAR
RAM CHARAN
ZEE STUDIOS
DIL RAJU PRODUCTION
SANKRANTI BLOCKBUSTER
SHANKAR'S
GAME CHANGER
PRODUCED BY RAJU - SHIRISH
A THAMAN S MUSICAL
TELUGU - TAMIL - HINDI - KANNADA - MALAYALAM
NOW IN CINEMAS


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
BLOCKBUSTER PONGALUU
సంక్రాంతికి వస్తున్నాం
AN ANIL RAVIPUDI FILM
PRODUCER SHIRISH

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 18-1-2025

Ananthapuramu | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అనంతపురము సిటీ**

కరివేపాకు రైతుల వద్దకు అధికారులు



రైతుతో మాట్లాడుతున్న ఉద్యాన శాఖ అధికారి శైలజ

పుట్లూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కరివేపాకు రైతుల సమస్యపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. బెంగళూరు వ్యాపారులు రైతులను మోసగిస్తున్న తీరుపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో ఉద్యాన శాఖ అధికారులను కలెక్టర్ రైతుల వద్దకు శుక్రవారం పంపించారు. పుట్లూరు, బాలాపురం, చింతకుంట గ్రామాల్లో ఉద్యాన శాఖ అధికారి శైలజ పర్యటించి, రైతులతో మాట్లాడారు. వ్యాపారుల నుంచి రావాల్సిన బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు నాగరంగయ్య, జయరామిరెడ్డి తదితరులతో మాట్లాడారు. ఏ ఏ గ్రామాల్లో ఎంతమంది రైతులకు డబ్బులు రావాలో నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపుతామని ఆమె తెలిపారు. తహసీల్దార్, ఆర్డీఓ స్థాయిలో మరోసారి వినతిపత్రాలు అందజేయాలని రైతులకు సూచించారు. ఏ రైతుకు ఎంత రావాల్సి ఉందో ఫిర్యాదులో పేర్కొనాలని సూచించారు.


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం : కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులతో అన్నారు. కలెక్టరేట్‌లో వేడుకల ఏర్పాట్లపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పోలీస్ పరేడ్ మైదానంలో పండుగ వాతావరణంలో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎలాంటి లోపాలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్ చక్కగా ఉండాలని అన్నారు. సమీక్షలో జేసీశివనారాయణశర్మ, డీఆర్వో మలోల తదితరులు పాల్గొన్నారు.

● సేవాఘడ్‌లో ఫిబ్రవరి 13, 14, 15తేదీలలో నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. బంజారాల ఆరాధ్య దైవమైన సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బస్సు, రైలు ప్రయాణాలకు తగిన ఏర్పాట్లు చేయాలని, పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

● జిల్లాలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే సీఎం ఈ కార్యక్రమం చేపట్టారని అన్నారు. ప్రతినెలా ఒక థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

మత్తు వద్దు బ్రో

అవగాహన పెంచాలని కలెక్టర్ ఆదేశం

'మత్తు వద్దు- ఆరోగ్యకర జీవితమే ముద్దు' అనే అంశంపై మానసిక ఆరోగ్య బృందంచేత పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎన్‌సీఓఆర్డీ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో కట్టడిచేయాలని అన్నారు. జిల్లాకు వాటిని రవాణా చేసేవారు, వినియోగించేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. .అనుమానిత వ్యక్తులు, ప్రాంతాలను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. విద్యాసంస్థలపై ప్రత్యేక నిఘా పెట్టాలని అన్నారు. కేజీబీవీలు, కళాశాలలు, యూనివర్శిటీలలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిత్యం పనిచేసేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. అగాహన కార్యక్రమాల ప్రణాళికను ఏడాదికి సరిపడా తయారు చేయాలని సూచించారు.

ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయసేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సూచించారు. న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం శాశ్వత లోక్ అదాలత్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ, న్యాయసేవ అధికార చట్టం కింద ప్రజా ప్రయోజన సేవలు అందిస్తామని తెలిపారు. బకాయిలు వసూలు, నష్టపరిహారం, సేవాలోపం వంటి ఫిర్యాదులు ముఖ్యంగా వస్తామని తెలిపారు. బ్యాంకులు, మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్ శాఖ, పోస్టల్, హౌసింగ్, డ్వామా, పారిశుధ్యం, ఎల్ఐసీ, ప్రభుత్వాసుపత్రి, విద్యా శాఖ, ఆర్టీసీ తదితర శాఖలు ఈ పరిధిలోకి వస్తాయని అన్నారు. రాజీమార్గంలో పరిష్కారానికి కృషి చేస్తూ, రాజీకుదరని పక్షంలో రూ.కోటి వరకు పరిహారం, వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం లోక్ అదాలత్‌కు ఉంటుందని తెలిపారు. శాశ్వత లోక్ అదాలత్‌లో ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎలాంటి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్, ఇటికె నల్లప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బియ్యం.. బంగారం..!



బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

కణేకల్లు సోనాకు డిమాండ్

హెచ్చెల్సీ పరిధిలో భారీగా సాగు.. క్యూ కడుతున్న కొనుగోలుదారులు


బియ్యాన్ని ప్యాకింగ్ చేస్తున్న హమాలీలు

మార్కెట్‌లో బియ్యం కొనాలంటే బెరుకు..! పాత బియ్యం అని చెబుతూనే కొత్తవి అంటగడుతారు. సోనా పేరుతో పాలిష్ చేసిన రేషన్ బియ్యాన్ని ఇస్తారు. ధర ఎంతపెట్టినా తీసుకున్నవి మంచి బియ్యమేనా అనే సందేహం భోజనం చేసిన ప్రతిసారీ వెంటాడుతుంటుంది. అందుకే చాలామంది రైతుల వద్దకు వెళ్లి నేరుగా కొంటుంటారు. మరీ ముఖ్యంగా.. మధ్యతరగతి ప్రజలు ఏడాదికి సరిపడా బియ్యాన్ని ఒకేసారి తీసుకుంటుంటారు. అలాంటి వారు హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో వరి కోతల కోసం ఎదురుచూస్తారు. కణేకల్లు మండలంలో వరి కోతలు మొదలు కాగానే బియ్యం కొనేవారి రాక మొదలౌతుంది. ఇక్కడ దిగుబడుల నాణ్యత, రుచే దీనికి కారణమని రైతులు, మిల్లర్లు అంటున్నారు. హెచ్చెల్సీ ఆయకట్టు పరిధిలో దాదాపు 23 వేల ఎకరాలలో వరి సాగవుతుంది. ఈ ప్రాంతంలో ఉన్న 12 రైస్ మిల్లులలో క్రషింగ్ జరుగుతుంది. ఉమ్మడి జిల్లాతోపాటు పొరుగు జిల్లాలవారు ఇక్కడికే నేరుగా వచ్చి బియ్యాని కొని తీసుకుపోతారు.

- ఆంధ్రజ్యోతి, కణేకల్లు

తగ్గిన ధర

కణేకల్లు మండల కేంద్రం, క్రాసింగ్ పరిధిలో 12 దాకా రైస్‌మిల్లులు ఉన్నాయి. రైతులు, వ్యాపారులు వరి ధాన్యాన్ని ఇక్కడి మిల్లులకు తరలించి నూర్పిడి చేయిస్తారు. ఇటీవల రైతులే నేరుగా తమ ధాన్యాన్ని మిల్లుకు తరలించి క్రషింగ్ చేయించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వరి ధాన్యం క్వింటం రూ.2,200 నుంచి రూ.2,400 పలుకుతోంది. బియ్యం ధర క్వింటం రూ.3,650 నుంచి రూ.3,750 వరకు పలుకుతోంది. పంట కోత మొదలు కాకమునుపు క్వింటం బియ్యం రూ.4,200 పైగా ఉండేది. ప్రస్తుతం సగటున రూ.3,700 మాత్రమే పలుకుతోంది. కణేకల్లులో పండే సోనా మసూరీ బియ్యానికి మంచి డిమాండ్ ఉంటోంది. చాలామంది ఒకే రకం వరిని సాగు చేస్తున్నారు.

ఏటా వస్తారు..

బియ్యం కొనుగోలులో నాణ్యత, నమ్మకానికి ప్రాధాన్యం ఉంటుంది. ఒక ఏడాదికి సరిపడా బియ్యాన్ని కొనేవారు.. మరుసటి ఏడాది కొనే సమయంలో గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుంటారు. మంచి బియ్యాన్ని గతంలో ఇచ్చినవారి వద్దకే మరోమారు వస్తారు. హెచ్చెల్సీ ఆయకట్టులో వరి పండటం, ఇక్కడే నూర్పిడి జరుగుతుండటంతో కల్తీ ఉండదని జనం నమ్ముతారు. హెచ్చెల్సీ ఆయకట్టు భూములు సారవంతమైనవి. కేవలం వరి మాత్రమే పండిస్తారు. బియ్యం కూడా నాణ్యంగా ఉంటాయి. అందుకే కొన్నేళ్లుగా ఈ ప్రాంతంలో పండించిన బియ్యానికి డిమాండ్ కొనసాగుతోంది. అనంతపురం, తాడిపత్రి, ధర్మవరం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం తదితర ప్రాంతాల ప్రజలు నేరుగా వచ్చి ఇక్కడి బియ్యాన్ని కొని తీసుకెళుతున్నారు.

నాణ్యమైన బియ్యం..



నేను 30 ఏళ్ల క్రితం రైస్‌మిల్‌ను నిర్మించి బియ్యం ఉత్పత్తి చేస్తున్నాను. ప్రతి ఏటా నాణ్యమైన బియ్యాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నాము. అనేక ప్రాంతాల నుంచి ప్రజలు బియ్యం కోసం మా వద్దకు వస్తుంటారు. సంతృప్తిగా బియ్యాన్ని తీసుకెళుతున్నారు.

- ఆనంద్, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు, కణేకల్లు

ఇతర ప్రాంతాల నుంచి..



కణేకల్లుతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా బియ్యానికి కొనడానికి వస్తారు. ఇక్కడి బియ్యానికి ఫుల్‌గా డిమాండ్ ఉంటోంది. నాణ్యతలో రాజీ పడకుండా ప్రజలకు బియ్యాన్ని అందిస్తున్నాం.

- చెన్నకేశవ, మిల్ యజమాని, కణేకల్లు

వినియోగదారులకు ఆసక్తి



కణేకల్లు బియ్యంపై వినియోగదారులకు ఆసక్తి ఉంటోంది. ప్రతి ఏడాదీ సీజన్ ప్రారంభం కాగానే గ్రామీణ, పట్టణవాసులు బియ్యం కొనేందుకు వస్తారు. కణేకల్లు బియ్యం బాగుంటున్నాయని చెబుతారు. మంచి బియ్యాన్ని వినియోగదారులకు ఇస్తున్నందుకు మాకు సంతోషంగా ఉంది.

- గోవిందు, మిల్ యజమాని, కణేకల్లు

ప్రతి ఏటా తీసుకెళుతున్నాం..



ఈ ప్రాంతంలో పండించిన బియ్యం రుచికరంగా ఉంటాయి. అందుకే ప్రతి సంవత్సరం వచ్చి బియ్యాన్ని తీసుకెళుతున్నాం. నాతో పాటు చుట్టుపక్కల వారు, మా బంధువులు అందరూ కణేకల్లు బియ్యం కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- ప్రహ్లాద, కొనుగోలుదారుడు, షెక్షాన్‌పల్లి

తాడిమర్రి నుంచి వచ్చాం..



కణేకల్లు బియ్యం నాణ్యంగా ఉంటాయని చాలామంది చెప్పారు. అందుకే బియ్యం కొనుగోలుకు తాడిమర్రి నుంచి వచ్చాం. ఇక్కడి మిల్లులలో బియ్యాన్ని పరిశీలించిన తర్వాత ఎక్కడ కొనాలో నిర్ణయించుకున్నాం. బియ్యం నాణ్యతలో పోటాపోటీగా ఉన్నాయి. నచ్చిన బియ్యాన్ని కొనుగోలు చేశాం.

- ఆదెప్ప, కొనుగోలుదారుడు, తాడిమర్రి

ప్రతి రోజూ రవాణా..



ప్రతి ఏడాది డిసెంబరు నుంచి జనవరి వరకు బియ్యం ఉత్పత్తి జరుగుతుంది. నాకు ప్రతి రోజూ బాడుగ దొరుకుతోంది. అనంతపురానికి ఆటోలో బియ్యాన్ని రవాణా చేస్తూ ఉపాధి పొందుతున్నాను. గల రెండు ఆటోలలో ప్రతి రోజూ అనంతపురానికి బియ్యాన్ని తీసుకెళ్లాను. అనంతపురం వాసులు ఈ బియ్యం పట్ల ఆసక్తి చూపుతారు.

- రాజు, ఆటో యజమాని, అనంతపురం

ఇక సెలవ్..
జవానుకు కన్నీటి వీడ్కోలు 3



నత్తకు నడకలు నేర్పేలా..!
పన్ను వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం
పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు..
రూ.4.35కోట్లకు.. రూ.1.07కోట్లే వసూలు 2



నమ్మించి నరికేశాడు
తాడిపత్రిలో భార్యను చంపిన భర్త 3



చీకటి తోడేళ్లు..!

పెన్నాలో ఇసుక దోపిడీ.. పామిడి వద్ద పొలాల్లోకీ చొరబాటు


రాత్రి పూట పెన్నానది ఇసుక రీచ్‌లో టిప్పరు ←


నదిలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వుతున్న అక్రమార్కులు →

పగలు ఇంటికి.. రాత్రి వ్యాపారానికి..

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా వ్యవహారాలు

తనిఖీలు మరిచిన జిల్లా కమిటీ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇసుక ఉచితంగా అందజేయాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం కొందరికి కాసుల వర్షం కురిపిస్తోంది. పగటి పూట ట్రాక్టర్లు, కూలీలతోనే ఇసుకను తరలిస్తారు. చీకటి పడగానే కథ నడిపిస్తారు. భారీ యంత్రాలు, టిప్పర్లను రంగంలోకి దింపుతున్నారు. ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా ప్రభుత్వ యంత్రాంగానికి తెలియదనుకుంటే పొరపాటే. నిత్యం అధికారులు తిరిగే ప్రాంతంలోనే ఈ దందా సాగుతోంది. పోలీసులు, రెవెన్యూ, భూగర్భగనుల శాఖ అధికారులు నిత్యం సంచరించే పామిడి సమీపంలోని పెన్నానదిని ఇసుకాసురులు దోచేస్తున్నారు. పెన్నా నది వారికి కాసులు కురిపించే హుండీగా మారింది. జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌లు ప్రస్తుతం అందుబాటులో లేవు. నది నుంచే జిల్లా కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలకు సైతం ఇసుకను తరలించి విక్రయిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

సొంతింటిని నిర్మించుకునే పేదలకు, ప్రభుత్వ భవన నిర్మాణాలకు మాత్రమే ప్రభుత్వం ఉచిత ఇసుకకు అనుమతి ఇస్తోంది. ఈ విధానాన్ని ఇసుకాసురులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. దందాలను కట్టడి చేయాల్సిన ఇసుక జిల్లా స్థాయి కమిటీ నిద్రమత్తులో ఉందన్న విమర్శలు వస్తున్నాయి. ఇసుక లభించే ప్రాంతాలు, డంపింగ్ యార్డులలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ తనిఖీ చేయాల్సి ఉంది. కానీ తనిఖీలు, పర్యవేక్షణ కనిపించడం లేదు. ఇదే అదనుగా బెంగళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాలకు జిల్లా నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పామిడి పెన్నానదితోపాటు జిల్లా వ్యాప్తంగా ఇసుక దొరికే ప్రాంతాలలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయి.

అక్రమాలకు అడ్డా పామిడి

పామిడి సమీపంలోని పెన్నా నది నుంచి పగటి పూట ఇళ్ల పేరుతో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తారు. రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. యంత్రాలను, టిప్పర్లను నదుల్లోకి తీసుకెళ్లి ఇసుకను తవ్వకూడదు, తరలించకూడదు. అందుకే వాటికి పగటి పూట విశ్రాంతి ఇస్తారు. చీకటి పడగానే పూర్తి స్థాయిలో పనిపెడతారు. ఉచిత ఇసుక కోసం ట్రాక్టర్‌తో పాటు కూలీలు, ఇసుక అవసరమైన వ్యక్తి కచ్చితంగా రావాలి. కానీ రాత్రి తవ్వకాల సమయంలో ఇలాంటివి ఉండవు. యంత్రాలు, వాటిని నడిపేవారు, టిప్పర్లు మాత్రమే పనిలో ఉంటాయి. పెన్నానది పరివాహక ప్రాంతంలోని పొలాల్లోకి చొచ్చుకువెళ్లి మరీ ఇసుకను తోడేస్తున్నారు. నదీగర్భాన్ని యంత్రాలతో కర్కశంగా చీల్చేస్తున్నారు.


బయట డంప్..

కాసుల వర్షం

ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం పేదలకంటే అక్రమార్కులకే ఎక్కువగా ఉపయోగపడుతోంది. అధికారులు గాలికి వదిలేయడంతో దందా యథేచ్ఛగా సాగుతోంది. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, మైన్స్ అధికారుల మధ్య ఏమాత్రం సమన్వయం కనిపించడం లేదు. ప్రతి నెలా జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో అప్పటి వరకూ చేసిన తనిఖీలు, పరిశీలనల పురోగతిపై నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఆ విషయాల గురించి అడిగే నాథుడే లేడు. జిల్లా ఉన్నతాధికారులు పెన్నానదిలోకి వెళ్లి పరిశీలిస్తే.. అక్కడ పడ్డ భారీ గోతులే అక్రమాలను చెబుతాయి. అంత తీరిక అధికారులకు ఉందా.. అన్నదే ప్రశ్న.


పగటి పూట ట్రాక్టర్లతో ఇలా..

మా దృష్టికి వస్తే..

జిల్లాలో ఇసుక రీచ్‌లు ఎక్కడా మనుగడలో లేవు. ఇసుక అవసరమైన వారు ఎక్కడి నుంచైనా తెచ్చుకుంటారు. అనుమతి లేని రీచ్‌లలో ఇసుక తవ్వకాలు, తరలింపు జరిగినట్లు మా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. ఇసుక అవసరమైన వారు కచ్చితంగా ట్రాక్టర్‌తో పాటు రీచ్‌కు వెళ్లాలి. యంత్రాలను వాడకుండా కూలీలతో నింపుకోవాలి. టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లు వెళితే సీజ్ చేస్తాం. అక్రమంగా తవ్వుతున్నట్లు మా దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్వర్లు, జిల్లా భూగర్భగనుల శాఖ అధికారి



మహమ్మద్ రఫీ నిర్మించిన శివుని ఉపాలయం

దేవుడు చేసిన మనుషులు

హిందూ దేవుళ్ల సేవలో ముస్లింలు

ఓబుళదేవరచెరువు, జనవరి17(ఆంధ్రజ్యోతి): సేవ, భక్తికి మతం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తి. హిందూ దేవాలయాలను నిర్మిస్తూ మతసామరస్యానికి ప్రతీకగా మారాడు. ఆయనే మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ. ఈయన ఎం.కొత్తపల్లి బండలపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణంలో శివుడికి ఉపాలయం నిర్మించాడు. అంతేకాక నిత్య పూజలు నిర్వహింపజేస్తున్నాడు.

ప్రాణాలు కాపాడాడని..

పదిహేనేళ్ల కిందట షేక్ మహమ్మద్ రఫీ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. అప్పుడే తన ప్రాణాలు కాపాడమని పరమేశ్వరుడికి మొక్కుకున్నట్లు తెలిపాడు. ఈక్రమంలోనే ఆయన ఆరోగ్యం మెరుగుపడింది. దీనికి ఆ శివయ్య చల్లని చూపే కారణమని భావించిన షేక్ మహమ్మద్ రఫీ అయ్యప్ప ఆలయం ఆవరణలో శివుడి ఉపాలయాన్ని రూ. మూడు లక్షలు ఖర్చు చేసి నిర్మించారు. శివ లింగాన్ని ప్రతిష్ఠింపజేసి నిత్య పూజలు జరిగేలా చూస్తున్నాడు. ప్రతిరోజు శివాలయం వద్ద కొంత సమయం గడపడం అలవాటు చేసుకున్నాడు. తనవంతుగా దైవకార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నాడు.



అయ్యప్పకు పూజాసామగ్రి అందజేస్తున్న నిజాం (ఫైల్)

అయ్యప్ప సేవలో మరో ముస్లిం

కొత్తపల్లి గ్రామానికి చెందిన ముస్లిం టైలర్ నిజాం గత పదిహేనేళ్లుగా అయ్యప్ప స్వామి సేవలో పాల్గొంటున్నాడు. అయ్యప్ప మకరదీపోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా 46రోజులకు సరిపడే ధూప దీప, నైవేద్యం పూజా సామగ్రిని అందిస్తున్నారు. ఒకరోజు అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తున్నారు.

అందరి దేవుడు ఒక్కడే: టైలర్ నిజాం, ఎం. కొత్తపల్లి



అందరి దేవుడు ఒక్కడే. అన్ని మతాల వారు కలిసిమెలిసి ఉండాలి. అందుకనే పదిహేనేళ్లుగా అయ్యప్ప సేవలో పాలు పంచుకుంటున్నా. అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నా. వినాయక చవితికి అవసరమైన ఏర్పాట్లలో పాలుపంచుకుంటున్నా.

తారతమ్యం వద్దు: మహమ్మద్ రఫీ, ఎం.కొత్తపల్లి



మనుషులకు కులమతాల తారతమ్యం వద్దు. దేవుడి సృష్టిలో అందరూ సమానమే. ఈ భావనతోనే శివాలయం నిర్మించి, శివలింగాన్ని ప్రతిష్ఠించా. నా ప్రాణాలు కాపాడిన శివుడిని కొలుస్తూ మొక్కు మేరకు ఆలయాన్ని నిర్మించా. నా వంతుగా అయ్యప్ప, ఇతర దేవుళ్ల సేవలో పాలు పంచుకుంటున్నా.

నత్తకు నడకలు



నేర్పేలా..!

పన్ను వసూళ్లలో అధికారుల నిర్లక్ష్యం

పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు

రూ.4.35కోట్లకు.. రూ.1.07కోట్లే వసూలు



ఎంపీడీఓ కార్యాలయం

అనంతపురంరూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో పన్ను వసూళ్ల నత్తనడకన సాగుతున్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతపురం రూరల్ మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.35కోట్ల పన్ను వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.1.07కోట్లు మాత్రమే వసూలు చేశారు. మరో రెండు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. మరి అధికారులు ఏమాత్రం లక్ష్యం చేరుకుంటారోనన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.

కొండంత లక్ష్యం

అనంతపురంరూరల్ మండలం పరిధి 21 పంచాయతీలు, అర్బన్ మండలంలో నాలుగు పంచాయతీలు ఉన్నాయి. ఇందులో పన్ను వసూలు చేస్తున్న గృహాలు, ఇతర సముదాయాలు 41,296 ఉన్నాయి. వీటికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.4.35 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.1.07కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ.3.30కోట్లు వసూలు కావాల్సి ఉంది. మండలంలో ఏ పంచాయతీలోనూ చెప్పుకోదగ్గ స్థాయిలో పన్ను వసూళ్ల లేవు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలే రూ.రెండు కోట్లకు పైబడి ఉన్నాయి. రూ.2.87కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.83.62 లక్షలు మాత్రమే వసూలు చేశారు. రెండు సంవత్సరాల పన్ను కలిపితే మొత్తంగా రూ.5.34కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఇంతమొత్తంలో వసూలు చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. కొందరు పంచాయతీ అధికారులు పనిచేసే గ్రామ పంచాయతీలు నగరానికి దగ్గరగా ఉండటంతో నిత్యం నగరంలో ఉంటూ తమ సొంత పనులు చేసుకుంటున్నట్లు సమాచారం. ఎప్పుడైనా కార్యాలయానికి వెళ్లినా ఎక్కువ సేపు అక్కడ ఉండటం లేదన్న విమర్శలు ఉన్నాయి. వీరు సరిగా పట్టించుకోకపోవడం వల్లే పన్ను వసూళ్ల సక్రమంగా సాగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వసూళ్లపై ప్రత్యేక దృష్టి: వెంకటనాయుడు, ఈఓపీఆర్డీ



నూతన ప్రభుత్వం వెబ్‌సైట్‌ను స్వర్ణ పంచాయతీగా మార్పు చేసింది. ఈ నేపథ్యంలో వెబ్‌సైట్‌లో అన్ని వివరాల నమోదుకు దాదాపు నెల రోజులు సమయం పట్టింది. దీంతో పన్ను వసూళ్లలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ప్రస్తుతం పన్ను వసూళ్లపైనే దృష్టి సారించాం. వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.



గ్రామ పంచాయతీల వారిగా పన్నుల వసూలు ఇలా..

గ్రామ పంచాయితీ	2023-24 అరియర్స్ రూ.	వసూలు రూ.	2022-25 వసూళ్ల లక్ష్యం రూ.	వసూలైంది రూ.
ఎ.నారాయణపురం	1.10కోట్లు	6.77లక్షలు	1.25కోట్లు	4.84లక్షలు
అక్కంపల్లి	4.81లక్షలు	2.84లక్షలు	6.02లక్షలు	2.77లక్షలు
ఆకుతోటపల్లి	9.02లక్షలు	4.07లక్షలు	27.32లక్షలు	10.14లక్షలు
ఆలమూరు	1.25లక్షలు	1.25లక్షలు	5.14లక్షలు	3.68లక్షలు
అనంతపురంరూరల్	12.86లక్షలు	8.67లక్షలు	36.72లక్షలు	8.17లక్షలు
చిన్నంపల్లి	1.48లక్షలు	1.18లక్షలు	2.29లక్షలు	1.12లక్షలు
చియ్యేడు	27వేలు	27వేలు	2.19లక్షలు	75వేలు
ఇటుకలపల్లి	46,338	46338	4.06లక్షలు	28,874
కక్కలపల్లిరూరల్	8.25లక్షలు	5.54లక్షలు	1.70లక్షలు	7.37లక్షలు
కక్కలపల్లికాలనీ	20.92లక్షలు	7.98లక్షలు	2.29లక్షలు	5.56లక్షలు
కామారుపల్లి	1.08లక్షలు	0	1.45లక్షలు	41వేలు
కందుకూరు	3.17లక్షలు	1.73లక్షలు	12.53లక్షలు	1.65లక్షలు
కాటిగానికాలువ	28వేలు	28,445	1.14లక్షలు	0
కట్టకిందపల్లి	1.03లక్షలు	1.03లక్షలు	5.86లక్షలు	4.20లక్షలు
కొడిమి	3.23లక్షలు	58,370	2.86లక్షలు	11,083
కురుగుంట	3.19లక్షలు	0	4.61లక్షలు	25,500
మన్నిల	2.32లక్షలు	56,890	1.89లక్షలు	73,823
నరసనాయునికుంట	1.15లక్షలు	69,970	1.35లక్షలు	2070
పూలకుంట	25,504	25,504	1.22లక్షలు	27,600
రాచానపల్లి	20.83లక్షలు	4.32లక్షలు	34.28లక్షలు	4.38లక్షలు
రాజీవ్‌కాలనీ	10.74లక్షలు	7.93లక్షలు	18.05లక్షలు	4.94లక్షలు
రుద్రంపేట	56.84లక్షలు	2.35లక్షలు	80.40లక్షలు	5.72లక్షలు
సోములదొడ్డి	4.79లక్షలు	2.94లక్షలు	7.21లక్షలు	88,864
తాటిచెర్ల	0	0	3.79లక్షలు	99,400
ఉప్పరపల్లి	8.93లక్షల	59,750	11.70లక్షలు	8.16లక్షలు

ఇద్దరు 'ఉత్తమ' సర్పంచ్‌లు



తిరుపాలు



రత్నమ్మ

అనంతపురం న్యూటౌన్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఇద్దరు సర్పంచులు ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికయ్యారు. ప్రతి జిల్లా నుంచి ఇద్దరి పేర్లను అధికారులు ఉత్తమ సేవా అవార్డుకు పంపారు. అందులో అనంతపురం జిల్లా నుంచి రాప్తాడు గ్రామ సర్పంచు సాకే తిరుపాలు, శ్రీసత్యసాయి జిల్లా నుంచి నల్లచెరువు సర్పంచు రత్నమ్మ ఉత్తమ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా వీరు పురస్కారం అందుకోనున్నారు. పంచాయతీల్లో వీరు చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజాసమస్యల పరిష్కారంలో చూపిన చొరవ తదితర వాటిని పరిగణనలోకి తీసుకుని ఉత్తమ సర్పంచ్‌లుగా ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు ఢిల్లీలో జరిగే వేడుకలకు సర్పంచు దంపతులకు ఆహ్వాన ఉత్తర్వులు జారీ అయినట్లు అధికారులు తెలిపారు.

ఏపీసీ బాధ్యతల స్వీకరణ



ఏపీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శైలజ

అనంతపురం విద్య, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు నూతన ఏపీసీగా శైలజ శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న ఏపీసీ పోస్టుకు డ్వామాలో ఏపీడీగా పనిచేస్తున్న ఆమెను నియమిస్తూ ఈ నెల 14న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలోనే ఆమె పూర్వపు స్థానంలో రిలీవ్ అయి ఏపీసీగా బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ ఇక్బాల్, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ స్టాఫ్ చంద్రశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, గురుమునికృష్ణ, ఇతర డీపీఓ స్టాఫ్ ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ధర ఖాస్తు



- ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు దరఖాస్తులు నిల్
- నేటితో ముగియనున్న గడువు
- భారీగా దరఖాస్తు రుసుం, ఫీజులే కారణం..

అనంతపురం అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు ఎవరూ ముందుకు రావడం లేదు. అనంతపురంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం తొలుత గతేడాది డిసెంబరు 17 నుంచి ఆ నెలాఖరుదాకా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. అప్పట్లో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. దీంతో గడువును ఈనెల 7 దాకా పొడిగించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ 18వతేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు చేసుకోవచ్చని ఉత్తర్వులు జారీచేశారు. అయినా శుక్రవారం సాయంత్రందాకా ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు. దరఖాస్తు చేసేందుకు కొన్ని గంటలు మాత్రమే సమయం ఉంది. దరఖాస్తు రుసుం రూ.15లక్షలు నాన్‌రిఫండబుల్ కావడం, వార్షిక పన్ను తొలి సంవత్సరం రూ.కోటి నిర్ణయించడమే దరఖాస్తులు రాకపోవడానికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు ని'బంధనాలు'..!

జిల్లా కేంద్రంలో ఐదేళ్ల కాల వ్యవధితో ప్రీమియం లిక్కర్ స్టోర్‌ను మంజూరు చేశారు. తొలి ఏడాదిలో లైసెన్స్‌దారులు రూ.కోటి వార్షిక పన్ను చెల్లించాలని నిర్ణయించారు. రెండో సంవత్సరం 10 శాతం పెంచాలని నిర్ణయించారు. ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం కనీసం 4000 చదరపు అడుగులు వైశాల్యం ఉండాలని షరతు పెట్టారు. ఈ స్టోర్‌లో ఐఎంఎఫ్ఎల్ కనీస ధర రూ.1200, బీర్ ధర రూ.400పైన స్టాక్ మాత్రమే విక్రయాలు జరపాలని నిబంధన విధించారు. స్టోర్‌లో మద్యం తాగేందుకు అనుమతించరు. మద్యం, సిగార్లు, సిగరెట్లు, మద్యానికి సంబంధించిన ఉపకరణాలు, శీతల పానీయాలను విక్రయించవచ్చుకోవచ్చు. దరఖాస్తు ఫీజు రూ.15 లక్షలు (నాన్ రీఫండబుల్) డ్రాఫ్ట్ ద్వారా చెల్లించాలని షరతు పెట్టారు. దరఖాస్తు ఫీజు ఎక్కువ మొత్తం పెట్టడంతో వ్యాపారులు ప్రీమియం లిక్కర్ స్టోర్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

ఈ రోజే గడువు: రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, అనంతపురం

జిల్లా కేంద్రంలో ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటు కోసం తొలుత డిసెంబరు నెలాఖరు దాకా గడువు ఇచ్చాం. దరఖాస్తులు రాకపోవడంతో ఈనెల 7వతేదీ దాకా పొడిగించాం. అయినా ఉపయోగం లేకపోవడంతో ఈనెల 18వతేదీ సాయంత్రం 5 గంటల దాకా దరఖాస్తు గడువును రాష్ట్ర ఉన్నతాధికారులు పొడిగించారు. ఇప్పటి దాకా ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. శనివారం ఆఖరి గడువు. ఔత్సాహికులు ఎవరైనా అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులను నేరుగా అందజేయవచ్చు.

రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో బ్యూటీషియన్ కోర్సుకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈనెల 24 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని, ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగిన మహిళలు అర్హులని తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9492583484 నంబరులో సంప్రదించాలని కోరారు.

20న ఏకసభ్య కమిషన్ రాక

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ అంశంపై అభిప్రాయ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్, విశ్రాంత ఐఏఎస్ రంజన్ మిశ్రా ఈ నెల 20న జిల్లాకు వస్తున్నారని ఓఎస్‌డీ షాహిద్‌బాబు శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీ అనంతపురం, 21న చిత్తూరు జిల్లాల్లో ఆయన పర్యటిస్తారని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి, షెడ్యూల్డ్ కులాల్లోని ఉప కులాల వర్గీకరణ అంశంపై చర్చిస్తారని తెలిపారు. జిల్లాల్లోని వ్యక్తులు, సంస్థల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నష్టాలు భరించలేక..

ఉద్యాన పంటల సాగుకు రైతులు దూరం

ప్రకృతి, తెగుళ్ల దెబ్బకు తగ్గిన దిగుబడి

కొరవడిన ప్రభుత్వ ప్రోత్సాహం


దానిమ్మ పంటను తొలగిస్తున్న అన్నదాతలు



శ్రీధరఘట్ట వద్ద దానిమ్మ చెట్లను తొలగిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటంతో ఉద్యాన రైతు ఉసూరుమంటున్నాడు. ముఖ్యంగా గత ఐదేళ్లల్లో ఉద్యాన శాఖ నిర్లక్ష్యానికి గురైంది. గత వైసీపీ ప్రభుత్వ తప్పిదం వల్ల మండలంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. గత ఐదేళ్లుగా కొత్తగా పండ్ల తోటల పెంపకానికి రైతులు ఆసక్తి చూపడంలేదు. మండలం ఎల్‌బీ నగర్ గ్రామం ఒకప్పుడు ఉద్యాన పంటల సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. ఇక్కడి రైతులు దానిమ్మ, అంజూర, ద్రాక్ష, బొప్పాయి తదితర పంటలను సాగు చేసేవారు. ఇక్కడ రెండువేల హెక్టార్లలో దానిమ్మ పంట సాగు అయ్యేది. పండిన పంటను చెన్నై, బెంగళూరు మార్కెట్లకు తరలించి అక్కడి నుండి ఇతర దేశలకు ఎగుమతి చేసేవారు. గత ప్రభుత్వంలో దానిమ్మ రైతులకు ప్రోత్సాహం లేకపోవడం, రాయితీలు రాకపోవడం, ఉధృతమైన తెగుళ్లను తట్టుకోలేక పలువురు రైతులు పంటను తొలగించారు. ప్రస్తుతం వందల ఎకరాలకు దానిమ్మ సాగు పడిపోయింది.


తుఫాన్ పరిహారం ఇవ్వలేదు



రెండేళ్ల కిందట తుఫాన్ కారణంగా దానిమ్మ పంట దిగుబడి పూర్తిగా నష్టపోయాం. అప్పటి ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. కానీ దాన్ని ఇవ్వకుండా అకౌంట్లో డబ్బులు డ్రా కాకుండా సస్పెన్స్‌లో పెట్టింది. 16 ఎకరాల్లో దానిమ్మ పంటను సాగు చేశా. గత ఏడాది వైరస్ వల్ల కాయలు పగిలిపోయి, రాలిపోయి తీవ్ర నష్టాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ ఏడాది వైరస్‌ను తట్టుకొని దిగుబడి వచ్చి, మంచి ధర వస్తే పెట్టుబడితో పాటు లాభాలు వస్తాయి.

- యర్రగుంట్ల వెంకటేశులు, ఎల్‌బీ నగర్

మూడేళ్లుగా నష్టమే



కరోనా, వైరస్ ఇతర తెగుళ్ల వల్ల దానిమ్మ పంటలో గత నాలుగేళ్లుగా నష్టాలే చూస్తున్నాం. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదు. దానిమ్మ కాయలు జామ కాయ పరిమాణం వచ్చిన తర్వాత రాలిపోతున్నాయి. సకాలంలో మందులను పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. ఈఏడాది ఇంట్లో తినేందుకు కూడా దానిమ్మ కాయలు దొరకడం లేదు. దానిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- గోరుంట్ల వెంకటేశులు, ఎల్‌బీ నగర్

కూటమి ప్రభుత్వం ప్రోత్సహించాలి



దానిమ్మ పంట సాగు చేస్తున్నా. దిగుబడి పెద్దగా లేదు. గిట్టుబాటు కావడంలేదు. గతంలో విదేశాలకు దానిమ్మను ఎగుమతి చేసేవాళ్లం. తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గింది. ఈ తెగుళ్ల నివారణకు సరైనా సలహాలు సూచనలు ఇచ్చేవారు లేరు. గత ఐదేళ్లల్లో ఉద్యాన పంటల అభివృద్ధి గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. తుఫాన్, వర్షాలు కారణంగా పంటలు దెబ్బతిన్నా పరిహారం అందలేదు. జరిగిన నష్టం నుంచి కోలుకోలేక పోతున్నాం. కూటమి ప్రభుత్వమన్నా దానిమ్మ పంట సాగును ప్రోత్సహించి సబ్సిడీ పథకాలు అందించాలి.

- ధనుంజయ, రైతు, ఎల్‌బీ నగర్

తెగుళ్ల ధాటికి కుదేలైన రైతు

పండ్ల తోటల సాగు విస్తీర్ణం తగ్గిపోవడానికి పెట్టుబడి ఎక్కువ కావడం, ప్రభుత్వ రాయితీలు సకాలంలో అందకపోవడం ప్రధాన కారణాలుగా రైతులు చెబుతున్నారు. ఎలాగోలా పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే అకాల వర్షాలు, అంతుచిక్కని తెగుళ్ల ధాటికి కళ్ల ముందే పంట దెబ్బతినడంతో ఉద్యాన రైతు కుదేలవుతున్నాడు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక పంటలను తొలగించిన ఘటనలు ఉన్నాయి. నష్టం జరిగిన ప్రతిసారి యంత్రాంగం లెక్కలు రాసుకెళ్లడం మినహా రైతులకు ఒనగూర్చిన ప్రయోజనం శూన్యం. గత వైసీపీ ప్రభుత్వంలో సంభవించిన తుఫాన్‌కు సంబంధించిన పంట నష్ట పరిహారం ఇంతవరకు ఇవ్వలేదు. గత ప్రభుత్వం మీ ఖాతాలోకి పరిహారం జమ చేశాయని చెప్పి సస్పెన్స్‌లో పెట్టి చేతులు దులుపుకుంది. పరిహారం ఇంత వరకు రాలేదని రైతులు అన్నారు.

ఇంకా.. సందిగ్ధమే..!

పరిశ్రమల మంజూరులో జాప్యం

- కొత్త పారిశ్రామిక పాలసీ.. జీవోతో సరి
- విడుదల కాని మార్గదర్శకాలు
- నిట్టూరుస్తున్న ఔత్సాహికులు

అనంతపురం అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంజూరుపై సందిగ్ధత నెలకొంది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే 2023-2027 పారిశ్రామికాభివృద్ధి పాలసీని రద్దు చేశారు. గత ఏడాది అక్టోబరు నెలలో 2024- 2029 కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీని ప్రవేశపెట్టారు. ఆ మేరకు జీవో జారీ చేశారు. కేటగిరీల వారిగా సబ్సిడీ ని నిర్ధారించారు. అయితే ఇప్పటి దాకా తగిన మార్గదర్శకాలు జారీ చేయలేదు. నూతన పారిశ్రామికాభివృద్ధి పాలసీ జీవో జారీ చేసి రెండున్నర నెలలు కావస్తున్నా ఇప్పటి దాకా క్షేత్ర స్థాయిలో అమలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు దరఖాస్తులతో పరిశ్రమల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంకా మార్గదర్శకాలు రాలేదని, త్వరలోనే వచ్చే అవకాశం ఉందని చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఎప్పటి నుంచి దరఖాస్తు చేసుకునే వెలుసుబాటు కల్పిస్తారన్న సమాచారం ఆ శాఖ అధికారుల వద్దనే లేకపోవడంతో ఏం చేయాలో తోచని అయోమయంలో అధికారవర్గాలు కొట్టుమిట్టాడుతున్నాయి.

జీవో జారీతో సరి




పరిశ్రమల శాఖ కార్యాలయం

2024- 2029 కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీకి సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేయడంతోనే సరిపెట్టింది. అందులో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి కేటగిరీల వారిగా సబ్సిడీని నిర్ధారించింది. ఓసీలకు 25 శాతం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళకు 35 శాతం సబ్సిడీ నిర్ధారించారు. గతంలో భారీ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీ ఉండేదికాదు. ఈ సారి భారీ పరిశ్రమలకు 12 శాతం పెట్టుబడి రాయితీ వర్తింపజేశారు. అయితే ఆపరేషన్ గైడ్‌లైన్స్ జారీ చేయకపోవడంతో ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

ఔత్సాహికులకు తప్పని నిరీక్షణ

కూటమి ప్రభుత్వం కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీకి సంబంధించిన జీవో జారీ చేయడంతో ఇక తమ ఆశలు నెరవేరినట్లేనని ఔత్సాహికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే జీవో జారీ చేసి రెండున్నర నెలలు గడిచినా పథకాల అమలుకు సంబంధించి విధినాలతో కూడిన ఆపరేషన్ గైడ్‌లైన్స్, జారీలో జాప్యం జరుగుతోంది. దీనిపై ఆయా వర్గాలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. వైసీపీ పాలనలో తమకు తగిన ప్రోత్సాహం ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుంటే ఇలా చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరగా మార్గదర్శకాలు విడుదల చేసి, పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరించాలని కోరుతున్నారు.



త్వరలో గైడ్‌లైన్స్ వచ్చే అవకాశం: శ్రీధర్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి



2024- 2029 కొత్త పారిశ్రామికాభివృద్ధి పాలసీకి సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య, భారీ పరిశ్రమలకు పెట్టుబడి రాయితీని నిర్ణయించారు. అందుకు సంబంధించిన గైడ్‌లైన్స్ త్వరలో వచ్చే అవకాశం ఉంది. మార్గదర్శకాలు రాగానే కొత్త పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి పారిశ్రామిక ఔత్సాహికులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటాం.

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

కొత్తచెరువు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం రైల్వేస్టేషన్ సమీపాన శుక్రవారం రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి గుర్తుతెలియని వృద్ధుడు (70) మృతిచెందాడు. హిందూపురం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైలులో ప్రయాణిస్తూ వృద్ధుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతిచెందాడు. రైల్వే కీమన్ సమాచారంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. వృద్ధుడి మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వృద్ధుడి మృతిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతిచెందిన వృద్ధుడు తెల్లనిగడ్డం, ఛామనచాయ వర్ణం, 5.5 అడుగుల ఎత్తుతో సిమెంటు కలర్ డ్రాయర్ ధరించి ఉన్నాడు. వృద్ధుడి సమాచారం తెలిస్తే 9441238182, 9440627641 నంబర్లలో సంప్రదించాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

బైక్ కొనివ్వలేదని ఆత్మహత్య


మంజునాథ్ మృతదేహం

పెద్దపప్పూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తండ్రి బైక్ కొనివ్వలేదని మనస్తాపం చెందిన కొడుకు ఉరి వేసుకున్నాడు. చాగల్లు గ్రామానికి చెందిన గంగరాజు కుమారుడు మంజునాథ్ (27) వ్యవసాయం చేసేవాడు. వీరికి పది ఎకరాల పొలం ఉంది. రేగు, చీనీ చెట్లను సాగు చేస్తున్నారు. మంజునాథ్ అన్న, అక్క ఉన్నారు. వారికి వివాహం జరిగింది. కొన్నాళ్లుగా తనకు బైక్ కొనివ్వాలని మంజునాథ్ అడుగుతున్నా.. తండ్రి పట్టించుకోలేదు. దీంతో మనస్తాపం చెంది, శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో..


మృతి చెందిన అంజినప్ప

శెట్టూరు, జనవరి 17(ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని చిన్న బలపంపల్లికి చెందిన గంటే అంజినప్ప (50) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అంజినప్పకు ఎనిమిది నెలల క్రితం పక్షవాతం సోకింది. ఒక చేయి, కాలు సరిగా పనిచేయడం లేదు. వైద్యం చేయించుకున్నా ఫలితం కనిపించలేదు. దీంతో మనస్తాపం చెంది గురువారం మధ్యాహ్నం ఎనుమును మేపేందుకు పొలానికి వెళ్లి అక్కడే పురుగుల మందు తాగాడు. గ్రామస్థులు గమనించి అంజినప్ప భార్యకు తెలియజేశారు. ఆమె వెంటనే పరశురాంపురం ప్రభుత్వాస్పత్రికి, ఆ తరువాత మెరుగైన చికిత్స నిమిత్తం చిత్రదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

రెండు రోజుల తర్వాత మృతదేహం లభ్యం

అనంతపురం క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రెండురోజుల కిందట కాలువలో పడిపోయిన సాయి శశాంక్‌రెడ్డి(28) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. నీరుగంటి వీధికి చెందిన సాయిశశాంక్‌రెడ్డి ఈనెల 15న సుఖ్‌దేవ్‌నగర్‌లోని హెచ్చెల్సీలో గల్లంతయ్యాడు. నాలుగో పట్టణ పోలీసులతో పాటు మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు గాలించినా ప్రయోజనం లేకపోయింది. కాగా శుక్రవారం సాయంత్రం 5గంటల సమయంలో మృతుడు పడిపోయిన ప్రాంతం నుంచి వంద అడుగుల దూరంలో గట్టుకున్న కంపచెట్లలో మృతదేహం ఉండగా పోలీసులు బయటకు తీశారు.

ఇక సెలవ్..

- జవానుకు కన్నీటి వీడ్కోలు
- జనసందోహం నడుమ అంతిమయాత్ర
- సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు


ధర్మవరంలో జవాను అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, జనవరి17(ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో ప్రాణాలొదిలిన జవానుకు అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు. కశ్మీర్‌లో విధి నిర్వహణలో గుండెపోటుతో మృతిచెందిన బీఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటరమణారెడ్డి అంతక్రియలు శుక్రవారం నిర్వహించారు. చెన్నేకొత్తపల్లి మండలంలోని స్వగ్రామమైన బసినేపల్లి శ్మశానవాటికలో ఆయన అంతక్రియలను సైనిక లాంఛనాలతో పూర్తి చేశారు. మండలంలో వివిధ గ్రామాలతోపాటు ధర్మవరం నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం 10.30 గంటలకు ధర్మవరంలో జవాను స్వగృహం నుంచి అంతిమయాత్ర ప్రారంభమై, మధ్యాహ్నం బసినేపల్లి శ్మశాన వాటికకు చేరుకుంది. ధర్మవరంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతోపాటు ఉద్యోగులు, ప్రజలు, స్నేహితులు, రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ.. జవాను భౌతికకాయంపై పూలమాల వేసి, నివాళులర్పించారు. విద్యార్థులు ధర్మవరం నుంచి బసినేపల్లి వరకు ద్విచక్రవాహనాల్లో జాతీయ జెండాలను చేతబట్టి జవాను అంతిమయాత్ర ముందు ర్యాలీగా వెళ్లారు. జవాను భౌతికకాయంపై కప్పిన జాతీయ జెండాను ఆయన భార్య హరిప్రియ, తల్లికి బీఎస్ఎఫ్ అధికారులు అందజేశారు. అనంతరం బీఎస్ఎఫ్ అధికారులు మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపి, గౌరవ వందనం సమర్పించారు.

కన్నీటి పర్యంతం

జవాను వెంకటరమణారెడ్డి భౌతికకాయం వద్ద భార్య, పిల్లలు, కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. భార్య హరిప్రియ బోరున విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. కుమారుడు మహీంద్ర రెడ్డి, కుమార్తె రితిక.. బోరున విలపించారు.


జాతీయ జెండాను జవాను భార్య, తల్లికి అందిస్తున్న బీఎస్ఎఫ్ అధికారి


గాలిలోకి కాల్పులు జరిపి వెంకటరమణారెడ్డికి గౌరవ వందనం సమర్పిస్తున్న బీఎస్ఎఫ్ జవాన్లు

అక్రమాల ఆఫీసు..!

- చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అడ్డగోలు వ్యవహారాలు
- నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు
- ప్రతి పనికీ పైసలిచ్చుకోవాల్సిందే..
- సబ్‌రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్‌పై వేటు



చిలమత్తూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు కేరాఫ్‌గా మారిందన్నది బహిరంగ రహస్యమే. నిబంధనలు తుంగలో తొక్కి అడ్డదిడ్డంగా రిజిస్ట్రేషన్లు చేయడం, ఇక్కడ పనిచేసే అధికారులకు మామూలే. ఆస్తుల రిజిస్ట్రేషన్లలో రికార్డులు ఉన్నా.. లేకున్నా మామూళ్లు ఇస్తే చాలు.. చేసేస్తారన్న అపవాదు ఉంది. లింక్ దస్తావేజులు లేకున్నా సబ్‌రిజిస్ట్రార్ వెంకటనారాయణ రిజిస్ట్రేషన్ చేశారన్న ఆరోపణలు ఉన్నతాధికారుల విచారణలో తేలడంతో ఆయనపై వేటు వేశారు. సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సీనియర్ అసిస్టెంట్ కుళ్లాయిస్వామిని సైతం సస్పెండ్ చేశారు. వెంకటనారాయణ చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్‌గా రెండోసారి పనిచేస్తున్నారు. ఈ తరుణంలో ఇక్కడ కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సఖ్యతగా ఉంటూ వారు కొనుగోలు, అమ్మకాలు చేసే ఆస్తుల రిజిస్ట్రేషన్లలో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చినట్లు సమాచారం. అందుకు ప్రతిఫలంగా వ్యాపారుల నుంచి పెద్దఎత్తున ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి అక్రమాలకు పాల్పడటంతోనే ఆయనపై ఉన్నతాధికారులు వేటు వేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

నిబంధనలు తుంగలోకి..: ముడుపులు ఇస్తే నిబంధనలు తుంగలో తొక్కి, రిజిస్ట్రేషన్ చేయడం ఆయనకు పరిపాటి. ఇటీవల ఫ్రీహోల్డ్ అసైన్‌మెంటు భూముల విక్రయాల్లో పెద్దఎత్తున అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోరంట్ల మండలంలో ఎక్కువగా లింక్ దస్తావేజులు పరిశీలించకుండానే కేవలం వన్‌బీ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున ముడుపులు ముట్టినట్లు తెలుస్తోంది. ఈ రిజిస్ట్రేషన్లలో దళారుల పాత్ర కనిపిస్తోంది. కొందరైతే ఇదే వృత్తిగా పెట్టుకుని, రూ.లక్షలు వెనకేసుకున్నారు. గోరంట్ల, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లలో గజాల లెక్కల రిజిస్ట్రేషన్లు చేసేశారు. లేఅవుట్‌లో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కావాలంటే ముందుగా ఆ భూమి కన్వర్షన్ అయి ఉండాలి. అనంతరం అహుడాగానీ, పంచాయతీగానీ అప్రూవల్ చేసి ఉండాలి. రిజిస్ట్రేషన్లలో మాత్రం వాటిని పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒక్కో సైట్‌కి ఇంత మొత్తంలో ముట్టజెబితే చాలు రిజిస్ట్రేషన్లు జరిగిపోతాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్లలో ప్రభుత్వం ప్రకటించిన మార్కెట్ విలువ ప్రకారం చలానా చెల్లించాల్సి ఉంటుంది. చలానా రుసుము తగ్గించి, ఆ సొమ్మును కాజేసినట్లు సమాచారం. ఇలా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొట్టారన్న ఆరోపణలున్నాయి.

అన్నింటికీ వసూళ్లే..: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి పనికి అదనంగా చెల్లించాల్సిందే. ఈసీ, నకళ్లు, ఆర్‌హెచ్, మార్కెట్ ధర ధ్రువీకరణ వంటి వాటికి ప్రభుత్వం నిర్దేశించిన రుసుముకు రెట్టింపు చెల్లించాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. రైటర్లు కూడా ప్రతి డాక్యుమెంట్‌కి కొంత కార్యాలయానికి ఇచ్చుకోవాల్సిందే. ఈ భారం ఆస్తుల కొనుగోలుదారులపై పడుతోంది. రిజిస్ట్రేషన్ సమయంలో ఏదైనా చిన్న సమస్య తలెత్తినా దానికి పెద్దఎత్తున కాసులు ఇచ్చుకోవాల్సిందే.

పలు దఫాలుగా దాడులు: అక్రమాలకు కేరాఫ్‌గా మారిన చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై పలు దఫాలుగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు చేశారు. ఇక్కడ ఎక్కువగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉండటంతో సమస్యాత్మక ఆస్తుల క్రయవిక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ పనిచేసిన అధికారులు సంపాదనకే ప్రాధాన్యమిస్తున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రతి పనికీ డబ్బు డిమాండ్ చేయడం, రికార్డులన్నీ సరిగా ఉన్నా ఏదో ఒక కొర్రీ చూపి రిజిస్ట్రేషన్లు ఆపడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇక్కడి వ్యవహారాలతో విసిగిపోయిన బాధితులు.. ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో దాడులు జరిగాయి. అయినా ఇక్కడ పరిస్థితిలో మాత్రం మార్పు లేదు. ఏదోరకంగా అవనీతికి పాల్పడుతూ అడ్డంగా బుక్కవుతున్నారు.

వైద్యుల పనితీరు మారాలి

- అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు
- జిల్లా ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ తనిఖీ


ఆస్పత్రిలో ఐసీయూ విభాగాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఈ వెంకటేశ్వర్లు

అనంతపురం టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది పనితీరు మార్చుకోవాలని అడిషనల్ డీఎంఈ డాక్టరు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జిల్లా సర్వజన వైద్యశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. నిత్యం పత్రికలలో వార్తలు వస్తున్నాయని, పనితీరు మారకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విభాగాల వారీగా వైద్యులు, విధుల కేటాయింపును అడిగి తెలుసుకున్నారు. చిన్న పిల్లల వార్డులో పడకలు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సదుపాయం గురించి ఓ స్టాఫ్ నర్సును ప్రశ్నించారు. సమాధానం చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఓడీ అక్కడ లేకపోవడంతో స్టాఫ్ నర్సుతోపాటు హెచ్‌ఓడీకి మెమో ఇవ్వాలని ఆదేశించారు. వసతుల కల్పనకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లి అన్ని విభాగాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది వివరాలను ఆరా తీశారు. అక్కడ 20 పడకలతో ప్రత్యేక క్యాజువాలిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న చిన్నపిల్లల సర్జరీ విభాగాన్ని సూపర్‌స్పెషాలిటీకి మార్చాలని ఆదేశించారు. అక్కడ పర్యవేక్షించే డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టరు సుబ్రమణ్యం కీలకమైన అనస్థీషియా విభాగం వారని, ఆయనను తప్పించి, సూపర్ స్పెషాలిటీలో పనిచేస్తున్న మరో ప్రొఫెసర్‌కు డిప్యూటీ సూపరింటెండెంట్ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకు ప్రతి ఒక్కరూ విధుల్లో ఉండాలని హెచ్చరించారు. వైద్య మంత్రి, వైద్యశాఖ కమిషనర్ జిల్లాలోని ఆస్పత్రుల విషయంలో చాలా సీరియస్‌గా ఉన్నారని అన్నారు. వారి ఆదేశాల మేరకే ఇక్కడకు వచ్చి పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆర్ఎంఓ రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ హేమలత, డాక్టర్ పద్మజ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నమ్మించి.. నరికేశాడు

- భార్యను హత్యచేసిన భర్త
- ఆస్తి అమ్మకానికి అడ్డొచ్చిందని..
- తాడిపత్రిలో దారుణం


భర్తతో పుష్పావతి(ఫైల్)

తాడిపత్రి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వ్యక్తి కట్టుకున్న భార్యను వేటకొడవలితో నరికేశాడు. కుటుంబ సమస్యలు, ఆస్తి తగాదాలే ఈ హత్యకు కారణమని పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. పుట్లూరు మండలం సి.వెంగన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్ రెడ్డికి నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి, ఓబులరెడ్డి దంపతుల కూతురు పుష్పావతి(35)తో సుమారు 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు భువనేశ్వర్‌రెడ్డి (11), చరణ్ కుమార్‌రెడ్డి(8) ఉన్నారు. వెంకటేశ్వర్ రెడ్డి కొంతకాలంగా వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్యను వేధిస్తున్నాడు. దీంతో పుష్పావతి ఆరునెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఉన్న పొలాన్ని భర్త అమ్ముతున్నాడని సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు, బంధువుల సహకారంతో పుష్పావతి అడ్డుకుంది. దీంతో కక్ష పెంచుకున్న వెంకటేశ్వర్ రెడ్డి భార్యను హత్య చేసేందుకు పథకం రూపొందించుకున్నాడు. పిల్లల పేరుతో భూమి రాయిస్తానని నమ్మబలికి, తాడిపత్రికి శుక్రవారం పిలిపించాడు. బస్టాండ్ సమీపంలో ఉన్న హేమాద్రి గెస్ట్‌హౌస్ (లాడ్జి) గది తీసుకున్నానని, అక్కడ మాట్లాడుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళదామని పిలిచాడు. దీంతో పుష్పావతి, ఆమె బంధువులు లాడ్జికి వెళ్లారు. కాసేపు మాట్లాడిన తరువాత భార్యను పక్క గదిలోకి తీసుకువెళ్లాడు. తన వదిన వస్తుందని, ఆమెతో మాట్లాడాల్సి ఉందని నమ్మించాడు. బయటకు వచ్చి పుష్పావతి బంధువులు ఉన్న గదికి తలుపులు వేసి గడియపెట్టాడు. భార్యను కొడవలితో విచక్షణా రహితంగా నరికేశాడు. తలుపులు బద్దలు కొట్టుకుని బంధువులు బయటకి వచ్చేసరికి పుష్పావతి రక్తపు మడుగులో కనిపించింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- గూబనపల్లి మలుపు వద్ద బైకులు ఢీ
- ఒక బైక్‌పై దూసుకెళ్లిన లారీ


ఫరూక్


నాసిర్

కళ్యాణదుర్గం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫరూక్ (25), నాసీర్ (18) అనే ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఒక వాహనంపై వెళుతున్న వీరిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. మరో వాహనంలో వెళ్తున్న ఇద్దరికి చిన్నపాటి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం శుక్రవారం రాత్రి జరిగింది. శెట్టూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన ఫరూక్, నాసీర్ బైక్‌పై కర్ణాటకలోని మొలకాల్మూరులో జరుగుతున్న ఇజ్‌తెమాకు బయలుదేరారు. గూబనపల్లి మలుపు వద్ద వీరికి ఎదురుగా బైక్ వచ్చింది. అదుపుతప్పి రెండూ ఢీకొన్నాయి. కిందపడ్డ ఇద్దరిపై కళ్యాణదుర్గం నుంచి రాయదుర్గం వైపు వెళ్తున్న ఓ లారీ దూసుకువెళ్లింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన సందీప్, చంద్రశేఖర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. వీరిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి నాసీర్‌కు పెళ్లి కాలేదు. చికెన్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఫరూక్‌కు రెండు సంవత్సరాల క్రితం పావగడ పట్టణానికి చెందిన ముజీబాతో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నాయకుడు దేవానంద్‌పై చీటింగ్ కేసు

కుమారుడు, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు సిబ్బందిపై కూడా..

కదిరి, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు గుడిసే దేవానంద్, ఆయన కుమారుడు సాయి దేవానంద్, డాక్యుమెంట్ రైటర్, ఇద్దరు సాక్షులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బందిపై చీటింగ్, ఫోర్జరీ, బెదిరింపు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పట్టణానికి చెందిన షేక్ నస్రీన్ బేగం గుడిసె దేవానంద్‌ను రూ. ఆరు లక్షలు అప్పు అడిగారు. అందుకు ఒప్పుకున్న దేవానంద్ మొదటగా రూ. 1.4లక్షలు ఇచ్చారు. తరువాత మిగిలిన డబ్బులు అడిగితే ఏదైనా ఆస్తి తనఖా పెట్టాలని కోరారు. ఇందుకు నస్రీన్‌బేగం తనకున్న ఏడు ఎకరాల ఆస్తిని ఆయకం పెట్టేందుకు భూమి పత్రాలు, ఇతర ఆధారాలు దేవానంద్‌కు ఇచ్చారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దేవానంద్ రెండు పత్రాలను తయారు చేసి, ఒకదానిలో ఆయకం పెట్టినట్లు రాయించి, మరో దానిలో పూర్తిగా అమ్మినట్లు రాయించి, తమతో సంతకాలు పెట్టించారని బాధితులు పేర్కొన్నట్లు తెలిపారు. తెలుగు రాని తాము సబ్‌రిస్ట్రార్ కార్యాలయం సిబ్బందిని నమ్మి సంతకాలు పెట్టామని, తాము ఏడెకరాల ఆస్తిని దేవానంద్‌కు అమ్మినట్లు, అందుకుగాను ఆయన రూ.13.91లక్షలు ఇచ్చినట్లు పత్రంలో రాయించి సంతకాలు పెట్టించుకున్నట్లు తెలిపారన్నారు. తమ కుమార్తె షేక్ షబ్బానాకు కూడా తెలియకుండా ఆపొలాన్ని షేక్ షబ్బానా కొన్నట్లు తప్పుడు సంతకాలు చేయించుకుని మోసగించారు. ఈవిషయంలో చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. దీంతో దేవానంద్ పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి, అప్పుగా తీసుకున్న డబ్బును, రిజిస్ట్రేషన్ ఖర్చును, తిరిగి ఇస్తే తమ స్థలం వెనకిస్తామని ఒప్పుకున్నాడన్నారు. ఈ మేరకు దేవానంద్ ఇంటివద్దకు వెళ్లి డబ్బులిచ్చిన తరువాత, రాసుకున్న ఒప్పంద పత్రం కూడా బలవంతంగా లాక్కుని, ఈవిషయం ఎక్కడన్నా చెబితే ఇబ్బంది పడతావని బెదిరించినట్లు నస్రీన్‌బేగం ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ధర్మవరం డీఎస్పీగా హేమంత్‌కుమార్

ధర్మవరం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డీఎస్పీగా బలగా హేమంత్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులుకు ఎక్కడికి పోస్టింగ్ ఇస్తారన్నది తెలియాల్సి ఉంది.

న్యూస్ బాక్స్

నగరపాలికలోకి అసిస్టెంట్ కలెక్టర్..


అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

అనంతపురం క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం నగరపాలికకు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న వచ్చారు. శుక్రవారం ఆమె నేరుగా కమిషనర్ చాంబర్‌లో ఆశీనులయ్యారు. నెలరోజుల పాటు ఆమె ఇక్కడ విధులు నిర్వర్తించనున్నట్లు తెలిసింది. ఆమె పరిపాలన విభాగంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన మల్లికార్జునరెడ్డి కొనసాగుతున్నారు. ఎప్పుడూ ట్రైనీ కలెక్టర్ ఇలాంటి పరిస్థితుల్లో నగరపాలికలోకి అడుగుపెట్టలేదు. వచ్చి మూడు, నాలుగు రోజుల పాటు శిక్షణ తీసుకుని వెళ్లేవారు. కలెక్టరేట్ కార్యాలయం నుంచి అధికారిక ఆదేశాల మేరకే వినూత్న ఇక్కడ విధులు నిర్వర్తించనున్నట్లు తెలుస్తోంది.

నేడు రక్తదాన శిబిరం

శింగనమల జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం శింగనమలలో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పిస్తామని, అనంతరం రక్తదాన శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. రక్తదానం చేయడానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఎల్‌కేపీలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురం కల్చరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక లలితకళా పరిషత్‌లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బెస్త నారాయణస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన నృత్యకళాకారులచే నృత్య ప్రదర్శనలు, ఏకపాత్రాభినయాలు, సినీ సంగీత విభావరి నిర్వహిస్తామన్నారు.

కుళ్లాయిస్వామి హుండీ లెక్కింపు

నార్పల, జనవరి17(ఆంధ్రజ్యోతి): నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి దేవాలయంలో శుక్రవారం హుండీని లెక్కించారు. ఈఓ శోభ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణంలో భక్తులు విడి దినాల్లో సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.16,53,160 వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్పందన అనంత కవుల వేదిక, హైదరాబాద్‌కు చెందిన కవి సంగమం సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని స్పందన అనంత కవుల వేదిక చంద్రశేఖరశాస్త్రి శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ విమర్శకుడు తూముచెర్ల రాజారామ్ రచించిన సాహిత్య విమర్శ వ్యాసాల సంపుటి 'పూల మీద వాలిన తేనెటీగ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తామన్నారు. సాహితీకారులు, సాహిత్యాభిమానులు హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు.

సమస్యలపై అధికారులు స్పందించాలి : మేయర్

అనంతపురం క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని సమస్యలపై అధికారులు స్పందించాలని నగర మేయర్ మహమ్మద్ వసీం అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని 50వ డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ శేఖర్‌బాబుతో కలిసి పర్యటించారు. పారిశుధ్య సమస్యలు, రోడ్లపై గుంతలు, కాలువలు లేకపోవడం వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. డ్రైనేజీల ఏర్పాటుతో పాటు రోడ్లపై గుంతలు పూడ్చేందుకు అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ రాధాకృష్ణ, డీఈ నరసింహులు, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

అమినిటీ కార్యదర్శి మృతికి సంతాపం

అమినిటీ కార్యదర్శి బాబు మృతికి నగరపాలికలో సంతాపం తెలిపారు. బాబు బ్రెయిన్‌ట్యూమర్‌తో మృతి చెందారు. నగరపాలిక కార్యాలయంలో బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర మేయర్ మహమ్మద్ వసీం, ట్రైనీ కలెక్టర్ వినూత్న, కమిషనర్ మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, సాహిత్య పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై చర్యలు : ఏఎస్పీ

అనంతపురం టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాపై చర్యలు తీసుకుంటున్నామని, నెలరోజుల్లో జిల్లాలో 7.270 కిలోల గంజాయిని పట్టుకోవడంతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నామని అడిషనల్ ఎస్పీ రామ్మూర్తి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్‌సీఓఆర్డీ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. ఈరెండు కేసుల్లో 14 మంది నిందితులను అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి పంపామని తెలిపారు. గంజాయిని భువనేశ్వర్ నుంచి వైజాగ్‌కు వచ్చి అక్కడి నుంచి గుంతకల్లుకు తీసుకు వచ్చినట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి రవాణా చేసేవారినే కాకుండా వినియోగదారులపైనా కఠినచర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మత్తు వల్ల జీవితాలు ఎలా నాశనం అవుతాయో తెలియజేస్తూ విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, డీటీసీ వీర్రాజు, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఈఓ ప్రసాద్‌బాబు, ఆర్ఐఓ వెంకటరమణానాయక్ పాల్గొన్నారు.

కోటంకకు నీరు విడుదల

గార్లదిన్నె, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలం పొట్టి చెరువు నుంచి శుక్రవారం కోటంక గ్రామానికి అధికారులు, టీడీపీ నాయకులు నీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా పొట్టిచెరువుకు గంగపూజ చేసి, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఫొటోలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ రాజాకుమార్, ఏఈఈ సుధాకర్, టీడీపీ నేతలు టీడీపీ నాయకులు సుబ్బు, సుబ్బరాయుడు, ఎర్రిస్వామి, ఎర్రితాత, రమణ, హరినాథ్, సుధాకర్, గోవిందరెడ్డి పాల్గొన్నారు.


పొట్టిచెరువు నుంచి కోటంకకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం

పశు నష్ట పరిహారంపై పరిహాసం..!

● జిల్లా అధికారులకే సమాచారం తెలియదట ●ఈనెల 13 నుంచే నేరుగా రైతుల ఖాతాల్లోకి.. ● ఇప్పటి దాకా రూ.21.84 కోట్లు జమ



అనంతపురం అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో ఏమి జరుగుతోందో ఆ శాఖ ఉన్నతాధికారులకే సమాచారం తెలియని పరిస్థితి నెలకొంది. పశువుల రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేస్తున్నా ఉన్నతాధికారులు మాత్రం సమాచారం తెలియదని అంటున్నారు. కరువు జిల్లాలోని పాడి రైతులకు కూటమి ప్రభుత్వం నష్టపరిహారం విడుదల చేసింది. గత వైసీపీ సర్కార్ హయాంలో పశునష్టపరిహారం పథకం ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు చేయలేకపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 2020- 2023 వరకు జిల్లాలో పలు కారణాలతో చనిపోయిన ఎనుములు, ఆవులు, గొర్రెలు, మేకలకు పశునష్టపరిహారాన్ని మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా 7,941 మంది రైతులకు రూ.22.50 కోట్లు మంజూరు చేసింది. ఈనెల 13వతేదీ నుంచి రైతుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేయడం మొదలైంది. శుక్రవారం దాకా 7,726 మంది రైతులకు రూ.21.84 కోట్లు పశునష్టపరిహారం జమ అయింది. మిగతా 215 మంది రైతులకు దాదాపు రూ.58.65 లక్షలు పెండింగ్‌లో పడిపోయింది. ఆయా రైతుల ఖాతాలు సరిగా లేకపోవడం, అకౌంట్ క్లోజ్ చేసుకోవడం తదితర కారణాలతో ఆ మొత్తాన్ని పెండింగ్‌లో ఉంచినట్లు సమాచారం. ఆయా రైతులతో మరోసారి బ్యాంక్ వివరాలు సేకరించి పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఆ పనిలో పశు సంవర్ధక శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. చనిపోయిన ఎనుముకు రూ.30వేలు, ఆవుకు రూ.15వేలు, గొర్రెలు, మేకలకు రూ.6వేలు పశునష్టపరిహారం మంజూరు చేశారు. ఈనెల 13వతేదీ నుంచే పశునష్టపరిహారం రైతుల ఖాతాలకు నేరుగా జమ అవుతున్నా పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియకపోవడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ముందస్తుగా ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడమే ఇందుకు కారణమన్న వాదనలు వినిపిస్తున్నాయి. తమ ఖాతాలకు పశునష్టపరిహారం జమైనట్లు వెటర్నరీ డాక్టర్లకు అర్హులైన రైతులు చెప్పడంతో ఆ సమాచారం ఆలస్యంగా పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయం వర్గాలకు తెలిసినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన జేడీ కార్యాలయ అధికారులు ఏఏ రైతులకు డబ్బులు జమయ్యాయి..? ఇంకా ఎంత మందికి జమ కావాల్సి ఉంది..? తదితర వివరాల ఆరా తీసే పనిలో నిమగ్నమయ్యారు.

మాతృ మరణాలపై కలెక్టర్ ఆగ్రహం

● ప్రత్యేక కమిటీతో విచారణకు ఆదేశం ● మాతాశిశుమరణాలపై కఠిన చర్యలు ● జిల్లా సమీక్షలో అధికారులకు హెచ్చరిక


మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం టౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మాతృ మరణాలపై నిపుణులైన వైద్యకమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాతాశిశుమరణాలపై జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నాలుగు మాతృమరణాలు జరగడంపై కలెక్టర్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగు మరణాలతో పాటు రాయదుర్గానికి చెందిన దేవిరెడ్డిశ్రీగౌరీ కేసును ప్రత్యేక వైద్యకమిటీతో విచారణ చేయించి నివేదికలు ఇవ్వాలని డీఎంహెచ్ఓను కలెక్టర్ ఆదేశించారు. మాతృ మరణాల కమిటీలో మెడికల్ కళాశాల ఎస్పీఎం డిపార్టుమెంట్ నుంచి ఒక ప్రొఫెసర్, ఒక పీజీ డాక్టర్ ఉండేలా చూడాలన్నారు. విచారణ పక్కాగా జరిగేలా డీఎంహెచ్ఓ చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యశాఖలో పనిచేసే డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, మాతాశిశుమరణాలు జరగకుండా అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి హైరిస్క్ గర్భిణీ విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకొని ప్రసవం పొంది ఇంటికి వెళ్లేవరకు వైద్యసేవలు అందించాలన్నారు. అందరూ సమష్టిగా పనిచేసినపుడే మంచిఫలితాలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ వనజాఅక్కమ్మ పాల్గొన్నారు.

సురక్షిత డ్రైవింగ్‌తోనే ప్రమాదాల నివారణ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రఘురామ్‌ప్రసాద్

అనంతపురం కల్చరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సురక్షిత డ్రైవింగ్‌తోనే ప్రమాదాలను నివారించగలమని ట్రాఫిక్ సీఐ రఘురామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు చేపడుతున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభ సభను శుక్రవారం అనంతపురం డిపో గ్యారేజీలో నిర్వహించారు. డీఎం నాగభూపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీఐ రఘురామ్‌ప్రసాద్‌తోపాటు ఆర్టీసీ ఎస్టీఐ రామాంజనేయులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బస్సులో ప్రయాణించే ప్రయాణికులందరి రక్షణ డ్రైవర్‌పైనే ఆధారపడి ఉంటుందని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ధ్యేయంగా ప్రతి డ్రైవర్ విధులు నిర్వర్తించాలన్నారు. మద్యపానం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ వంటివి చేయకూడదన్నారు. డీఎం నాగభూపాల్ మాట్లాడుతూ... రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 2వ తేదీ వరకు రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిలోనూ బస్సులకు నాణ్యతా పరీక్ష, సిబ్బందిచే రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరం వంటి రకరకాల ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్టాండ్ మేనేజర్ కేఎస్ మూర్తి, ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

20 నుంచి భూముల రీ సర్వే

గార్లదిన్నె/శింగనమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 20 నుంచి రీ సర్వే చేపడుతున్నట్లు గార్లదిన్నె తహసీల్దార్ బండారు ఈరమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేతో గ్రామాల్లో చాలా మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రీసర్వే వల్ల వచ్చిన సమస్యలతో రైతులు చాలా మంది కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన రెవిన్యూ సదస్సుల్లో ఎక్కువ శాతం రీసర్వేపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. మండలంలోని కల్లూరు గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేశామని తెలిపారు. రెండో విడత రీసర్వేలో తప్పులకు తావులేకుండా చేయాలని శింగనమల తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య తెలిపారు. శుక్రవారం శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో రెండో విడత రీసర్వేలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికయిన పెద్దమట్లగొంది గ్రామంలో చేపట్టనున్న సర్వేలో ఎలాంటి తప్పులకు తావులేకుండా చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. సమావేశంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పునీత్‌కుమార్, డిప్యూటి తహసీల్దార్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 45 గొర్రెపిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

చెన్నేకొత్తపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరియాన్ చెరువు గ్రామ శివారులో కుక్కల దాడిలో 45 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన ముగ్గురు కాపర్లు గ్రామ శివారులో ప్రతి రోజు గొర్రెల మందను నిలుపుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గొర్రెపిల్లలను వాటి కోసం ఏర్పాటు చేసిన దొడ్డిలో ఉంచి గొర్రెలను మేపేందుకు వెళ్లారు. తిరిగి గొర్రెల మందతో సాయంత్రం వచ్చి చూడగా 45 పిల్లలు మృతి చెంది ఉన్నాయి. అందులో బెల్లం కిష్టప్పకు చెందిన 22, చిత్రా చిరంజీవి 17, మల్లికార్జునకు చెందిన 5 గొర్రెపిల్లలు ఉన్నాయి.

కుష్ఠు వ్యాధిపై శిక్షణ

శింగనమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధిపై అవగాహన ఉండాలని తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ అన్నారు. శుక్రవారం శింగనమల గ్రామ ఆరోగ్యకేంద్రంలో కుష్టువ్యాధిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు సవిత, అరవింద్ పాల్గొన్నారు.

బాల్యమిత్రుడికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

నార్పల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న బాల్యమిత్రుడికి స్నేహితులు అండగా నిలిచారు. నార్పల మండల కేంద్రం ఉయ్యాలకుంట కాలనీకి చెందిన తలారి పుల్లయ్యకు రెండు కిడ్నీలు దెబ్బతినడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. వైద్యం కోసం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న 2001-02 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహితులతో చర్చించారు. శుక్రవారం పుల్లయ్య కుటుంబసభ్యులకు రూ.63వేలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రామకృష్ణ, లక్ష్మీనరేష్, ధనుంజయ నాయక్, దావూద్, ప్రకాష్, అన్సార్‌బాష, రామాంజనేయులు పాల్గొన్నారు.


పుల్లయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేస్తున్న పూర్వ విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి పూజలు


పూజలందుకుంటున్న గణనాథుడు

అనంతపురం కల్చరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నగరంలోని పలు వినాయక మందిరాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మల్లేశ్వరరోడ్డులోని లక్ష్మీగణపతి మందిరంలో గణనాథుని మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు చేయడంతోపాటు పూలు, కుడుములు, గరికతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులు సంకష్ట చతుర్థి వ్రతాన్ని ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

కమిషన్ పర్యటనను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఎస్కేయూ నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం నియమించిన ఏకసభ్య కమిషన్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఎస్కేయూ నాన్‌టీచింగ్ అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఎస్కేయూలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బంగి సంజీవప్ప, నారాయణప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తాధ్వర్యంలో వర్గీకరణ అమలు చేసేందుకు గ్రామాల వారిగా సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా నియమించిన కమిషన్ బృందం ఈనెల 20 నుంచి జిల్లాలో పర్యటిస్తుందని వివరించారు. బృంద సభ్యులకు సహకరించి సరైన వివరాలు అందించాలని తెలిపారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

అనంతపురం విద్య, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24వ తేదీ నుంచి నూజివీడులో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్యావైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో శిక్షణ తరగతుల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ తెచ్చిన నూతన విద్యావిధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. విద్యను పూర్తిగా కాషాయీకరణ చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఆంజనేయులు, వెంకట్ నాయక్, వంశీ, మంజునాథ్, ఉమామహేష్, నాని పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.11

అనంతపురంరూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.11తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.9, కనిష్ఠ ధర రూ.7 పలికినట్లు ఆయన పేర్కొన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.28వేలు

అనంతపురంరూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.28,320, కనిష్ఠంగా రూ.6వేలు, సరాసరి రూ.18,220వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 23 టన్నుల చీనీకాయలు వచ్చాయని వెల్లడించారు.

68 ఏళ్ల తరువాత దుర్గమ్మ జాతర

మూడు గ్రామాల పెద్దలతో ఎమ్మెల్యే సమావేశం

రామగిరి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోటలో 68 ఏళ్ల తరువాత దుర్గమ్మ జాతర నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిపై నసనకోట, గంగంపల్లి, వెంకటాపురం గ్రామస్థులతో శుక్రవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సమావేశమయ్యారు. నసనకోట, గంగంపల్లి గ్రామాల వద్ద కొలువైన దుర్గమ్మకు 68 ఏళ్ల క్రితం జాతర జరిగింది. తరువాత పలు కారణాలతో జాతర నిర్వహించలేదు. ఈ ఏడాది జాతర నిర్వహించాలని మూడు గ్రామాల ప్రజలు పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. జాతర ఎలా నిర్వహించాలి, ఆలయ ప్రాంగణం వద్ద సాధ్యమవుతుందా తదితర అంశాలపై చర్చించారు. అందరి అభిప్రాయాలు విన్న తరువాత జాతర కచ్చితంగా నిర్వహిద్దామని పరిటాల సునీత, శ్రీరామ్‌లు తెలిపారు. జాతర ఎప్పుడు, ఎలా అన్నది మరోసారి సమావేశమై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించండి : ఎంపీ


ఎల్ఐసీ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అంబికా

అనంతపురం అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంస్థ ఎండీ సత్పాల్ భానూను అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు శుక్రవారం ముంబైలో ఎల్ఐసీ ఎండీని ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. బీమా చట్ట సవరణలో ఎల్ఐసీ ఏజెంట్లు ప్రైవేటు కంపెనీ పాలసీలను కూడా విక్రయించేందుకు అనుమతి ఇచ్చారని, ఈ మార్పులు అభివృద్ధికి దారితీసినప్పటికీ ఎల్ఐసీ స్థిరత్వం, దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఎండీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సవరణల ద్వారా ఏజెంట్లు ఇతర సంస్థలకు మొగ్గు చూపే అవకాశాలు పెరగడంతో ఎల్ఐసీ మార్కెట్ వాటా తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ ప్రతిపాదన సవరణను పునరాలోచించి, ఎల్ఐసీ ఏజెంట్లు, ఉద్యోగులు ప్రయోజనాలను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సుజనాచౌదరిని కలిసిన అనంత ఎమ్మెల్యే


సుజనా చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి, విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనా చౌదరిని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో సుజనా చౌదరిని కలిసి పలు అంశాలపై చర్చించారు. అనంతపురం అర్బన్, జిల్లా రాజకీయ పరిస్థితులపై సుజనా చౌదరి ఆరా తీశారు.

విశాఖ స్టీల్‌కు ప్యాకేజీ సీఎం ఘనతే

విశాఖ స్టీల్‌కు కేంద్రం ప్యాకేజీ ఇవ్వడం సీఎం చంద్రబాబు ఘనతేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ సర్కార్ నిర్లక్ష్యంతో విశాఖ ఉక్కు పరిశ్రమ ఉనికికే ప్రమాదం ఏర్పడిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను పురోగతి వైపు నడిపించేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం ప్యాకేజీతో పూర్వ వైభవం వస్తుందన్నారు.

రేపు రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఆయుష్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమారయ్య


మాట్లాడుతున్న కుమారయ్య

అనంతపురంటౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ప్రొద్దుటూరులో ఆదివారం ఆయుష్ మెడికల్ అసోషియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమారయ్య తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆయుష్ డాక్టర్లు, సిబ్బంది అనేక సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రొద్దుటూరులోని ఆదిత్య ఆయుర్వేద ఆసుపత్రి నందు కార్యవర్గసమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ కేడర్లకు చెందిన రాష్ట్రనాయకులు హాజరవుతున్నారని, అసోషియేషన్ బలోపేతం, సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ ప్రణాళికల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ఆయుష్ డాక్టర్, సంఘ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

రోడ్డు భద్రత నియమాలపై శిక్షణ

అనంతపురం అర్బన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వీర్రాజు సూచించారు. స్థానిక ఉపరవాణా కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురష్కరించుకుని స్వచ్ఛంద సేవకులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు శిక్షకులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. ప్రమాదానికి కారణమైన వారు ఆగకుండా వెళ్లిపోవడం నేరమని అన్నారు. ప్రమాదాలకు కారణాలు, నివారణకు పాటించాల్సిన పద్ధతులపై క్షేత్ర స్థాయిలో సమావేశాలు నిర్వహించి, విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, ఏఎంవీఐ కేఎల్ఎన్ ప్రసాద్, ఆర్టీసీ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, ఆర్డీటీ, కార్డ్, ఆపిల్ తదితర స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌సీసీ ప్రతినిధులు, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా ప్రమాదం

● హెడ్‌కానిస్టేబుల్, మరో వ్యక్తికి తీవ్రగాయాలు

అనంతపురం క్రైం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యంను గోడౌన్‌కు తీసుకెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ నారాయణ నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. రెండు రోజుల కిందట టూటౌన్ సీఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో 45 బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ బియ్యాన్ని శుక్రవారం గుంతకల్లులోని గోడౌన్‌కు తరలించేందుకు బొలెరో వాహనంలో బయల్దేరారు. అయితే నగరంలోని తపోవనం సర్కిల్ దాటిన తరువాత హైవేలో వెళ్తుండగా అడ్డుగా వచ్చిన ఆటోను తప్పించబోయిన బొలెరో డ్రైవర్ సమీపంలోని గోడను ఢీ కొట్టాడు. ఈక్రమంలో ఆటో కూడా బోల్తా పడింది. దీంతో బొలెరోలో ప్రయాణిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ నారాయణనాయక్, ఆటోలో ప్రయాణిస్తున్న సుబ్బారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

గార్లదిన్నె, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సురక్ష చారిటబుల్ ట్రస్టు కో ఆర్డినేటర్ ఎ.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో సురక్ష చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హెల్త్ చెకప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ.. ప్రస్తుతం సమాజంలో చాలా మంది ఆరోగ్యం పట్ల శ్రద్ధచూపడం లేదన్నారు. ఫలితంగా తక్కువ వయసులోనే బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని తెలిపారు. అనంతరం హెల్త్ చెకప్‌కు వచ్చిన వారికి బీపీ, షుగర్, థైరాయిడ్, లివర్, కిడ్నీ తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్కింతల ప్రశాంతి, వలంటీర్లు శ్రీలత, కృష్ణవేణి పాల్గొన్నారు.


సర్పంచుకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

20 నుంచి భూముల రీ సర్వే

కూడేరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని జయపురం గ్రామ రెవెన్యూ పొలంలో ఈ నెల 20వ తేదీ నుంచి భూముల రీ సర్వే ప్రారంభమవుతున్నట్లు తహసీల్దార్ మహబూబ్ భాషా, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ దబ్బరప్రసాద్ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. జయపురం గ్రామం పైలెట్ గ్రామంగా ఎంపికైందని, దీంతో అందులో 20వ తేదీ నుంచి సర్వే మొదలవుతుందని అన్నారు. జయపురం పొలంలో 3,900 ఎకరాల భూమిని మూడు బృందాలు సర్వే చేస్తారని, భూములకు సంబంధించిన ఆధారాలను ఆయా రైతులు సర్వే బృందానికి చూపించాలని సూచించారు. రోజుకు ఒక్కొక్క బృందం 20 ఎకరాల వరకు సర్వే చేస్తారన్నారు. ఉన్నతాధికారులు నిర్దేశించిన గడువులోపు సర్వే పూర్తి చేస్తామని వారు పేర్కొన్నారు.

ఆధార్ శిబిరాలను వినియోగించుకోండి

ఉరవకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రవిప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 30 వతేదీ వరకూ ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉరవకొండ, అమిద్యాల సచివాలయాల్లో 21 నుంచి 24వ తేదీ వరకూ, ఉరవకొండ, మోపిడి సచివాలయాల్లో 27 నుంచి 30వతేదీ వరకూ శిబిరాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

బొమ్మనహాళ్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా శనివారం రాయదుర్గం పట్టణంలో జరిగే రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని బొమ్మనహాళ్ టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలో సీతారామాంజనేయ కళ్యాణ మంటపంలో శనివారం నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి తరలిరండి

పుట్లూరు, జనవరి17(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం నీలారెడ్డిపల్లిలో శనివారం నిర్వహించే ఎన్టీఆర్ వర్ధంతికి మండలం నుంచి టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని మండల కన్వీనర్ బాలరంగయ్య శుక్రవారం ప్రకటనలో కోరారు. నీలారెడ్డిపల్లిలో నివాళులర్పించిన అనంతరం శింగనమలలో రక్తదాన కార్యక్రమం ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి

శెట్టూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఏపీడీ రమేష్ నాయక్ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని బసంపల్లిలో చేపడుతున్న మినీగోకులం షెడ్లను, ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడిగిన ప్రతి కూలీకు ఉపాధి పనులు కల్పించాలని, మినీ గోకులం షెడ్ల పనులు వేగవంతం చేసి సకాలంలో బిల్లులు అందేవిధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. మెట్ట భూములలో పండ్లతోటల పెంపకం చేపట్టిన రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. ఏ ఒక్కరు బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయకూడదన్నారు. విధుల పట్ల అలసత్వం వహించిన టెక్నికల్ అసిస్టెంట్ నాగరాజుకు మెమో జారీ చేశామని తెలిపారు. తీరు మార్చుకోకపోతే ఎవరిపైనా అయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు ప్రజావేదిక

గుంతకల్లుటౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో శనివారం ప్రజావేదికపై నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి, ఏపీఓ కృష్ణమూర్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2023-24సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై గత డిసెంబరు 30నుంచి జనవరి 11వరకు సామాజిక తనిఖీ బృందం తనిఖీ చేశారన్నారు. ఆ తనిఖీ నివేదికలను ప్రజావేదికలో వెల్లడిస్తామని తెలిపారు. క్షేత్రసహాయకులు హాజరుకావాలన్నారు.

కుష్ఠు సర్వేపై శిక్షణ

బ్రహ్మసముద్రం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి కుష్ఠువ్యాధిగ్రస్థుల గుర్తింపునకు సర్వే నిర్వహించాలని అన్నారు.

దారి చూపిన ప్రధాని



దారి గుర్తింపు కోసం సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది

బ్రహ్మసముద్రం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డి - ముద్దలాపురం గ్రామాల మధ్య రహదారి సమస్య ప్రధాన మంత్రి కార్యాలయం జోక్యంతో పరిష్కారమైంది. ముద్దలాపురం విద్యార్థులు రాయలప్పదొడ్డి పాఠశాలలో చదువుతున్నారు. ఆ ఊరికి వెళ్లేందుకు సరైన దారి లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్రధాని నరేంద్ర మోదీకి తెలియజేస్తూ మెయిల్ పెట్టారు. దీంతో స్పందించిన ప్రధాని కార్యాలయం, పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మండల రెవెన్యూ అధికారులను క్షేత్రస్థాయికి పంపించారు. తహసీల్దారు సుమతి తమ సిబ్బంది, సర్వేయర్లను గ్రామానికి పంపి సర్వే చేయించారు. డైక్లాట్‌లో ఉన్న రహదారిని గుర్తించారు. దారికి హద్దులు చూపడంతో ముద్దలాపురం, రాయలప్పదొడ్డి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ జూడో పోటీలకు ఎంపిక



మహిధర్

కళ్యాణదుర్గం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జాతీయ జూడో క్రీడలకు మండలంలోని పాపంపల్లికి చెందిన విద్యార్థి మహిధర్ ఎంపికయ్యాడు. మహిధర్ ఇటీవల గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచినట్లు కుటుంబసభ్యులు శుక్రవారం తెలిపారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో జరిగే జాతీయ జూడో పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు.

ఆర్టీసీ చైర్మన్‌ను కలిసిన జితేంద్రగౌడ్



ఆర్టీసీ చైర్మన్‌తో జితేంద్రగౌడ్

గుంతకల్లుటౌన్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావును టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ విజయవాడలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలి శారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్‌అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడ్, గుత్తి మాజీ ఎంపీపీ వీరభద్రయ్య తదితరులు ఉన్నారు.

ఊరి బయట.. ఒక్కరోజు..!

● తమ్మయ్యదొడ్డిలో కొనసాగిన ఆచారం



గ్రామ చివర ఏర్పాటు చేసుకున్న గుడిసెలు



ఆరుబయటే వంట చేసుకుంటున్న గ్రామస్థులు

కుందుర్పి మండలం తమ్మయ్యదొడ్డి గ్రామస్థులు ఊరు విడిచి బయటకు వచ్చేశారు. గ్రామ శివారులో 24 గంటలు గడిపి.. శుక్రవారం సాయంత్రం తిరిగి ఊరిలోకి వెళ్లారు. ఆ సమయంలో గ్రామంలోకి ఎవరూ ప్రవేశించకుండా ఊరి చుట్టూ 20 మందిని కాపలాగా పెట్టారు. ఐదేళ్లకు ఒకసారి ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. మూగజీవాలను సైతం ఆ రోజు ఊరిలో ఉండనివ్వరు. ఒకరోజుకు సరిపడా ఆహారం, సామగ్రిని తీసుకుని అందరూ ఊరి బయటే ఉండిపోతారు. వంటా వార్పు అక్కడే చేస్తారు. గ్రామ క్షేమాన్ని, శాంతిని కోరుకుంటూ తమ పెద్దలు ఈ ఆచారాన్ని ప్రారంభించారని, తరతరాలుగా తాము కొనసాగిస్తున్నామని ఊరి జనం అంటున్నారు. కోడి మాంసం, కోడి గడ్డు కూడా ఊరిలోకి తీసుకెళ్లరు. పాలనాయక, నరసింహ స్వాములను కొలుస్తారు. తమ్మయ్యదొడ్డిలో 80 కుటుంబాలు ఉన్నాయి. ఈ ఆచారాన్ని ఉల్లంఘిస్తే తమకు కీడు జరుగుతుందని విశ్వసిస్తారు.

-ఆంధ్ర జ్యోతి, కుందుర్పి

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

● ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌కాలనీ, అంబేడ్కర్‌కాలనీ, చెన్నకేశవకాలనీల్లో ప్రజలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాలనీల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, అలాగే తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీల వాసులు ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఆయన సత్వరమే పరిష్కారమయ్యే సమస్యలను 24గంటలలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే తాగునీటి సమస్య ఎక్కడెక్కడ ఉందో పరిశీలిస్తామని, అనంతరం శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొన్నినెలల సమయం ఇస్తే తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని అన్నారు. తాడిపత్రి నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చేయాలన్నదే తన లక్ష్యమని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దేవకుమార్, హౌసింగ్ ఏఈ లోకేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ రాజారావు, వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, సర్పంచ్ అనురాధ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రహ్మయ్య ఆలయం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన వన్నూరుస్వామి, భార్య అరుణ, కుమార్తె నందినితో కలిసి బైక్‌పై పొలం పనులకు బయలుదేరాడు. కాగా బ్రహ్మయ్య ఆలయం వద్ద రోడ్డు పక్కన బైక్‌ను నిలిపి టిఫెన్ కోసం రోడ్డు సమీపంలోని హోటల్‌కి వెళ్లాడు. భార్య అరుణ, కుమార్తె నందిని బైక్ వద్దే ఉండిపోయారు. అయితే వారికి వెనుక వైపున 20 అడుగుల దూరంలో నిలిచి ఉన్న ఐషర్ వాహనానికి డ్రైవర్ హ్యాండ్‌బ్రేక్ వేయడం మరచిపోవడంతో అది ముందు డౌనల్ ఉండడంతో వేగంగా దూసుకొచ్చి వారిని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కళ్యాణదుర్గం పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అపహరణ

పామిడి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తబస్టాండ్ వద్ద నిలిపిన ద్విచక్ర వాహనం శుక్రవారం పట్టపగలు అపహరణకు గురైంది. మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన సాధిక్‌వలి శుక్రవారం కొత్త బస్టాండ్ వద్ద టీవీఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనాన్ని నిలిపి నమాజ్‌కు వెళ్లాడు. మసీదు నుంచి తిరిగి వచ్చి చూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో పామిడి పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

పామిడి పట్టణంలోని 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న కూల్‌డ్రింక్ షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. స్థానిక హనుమాన్ థియేటర్ వీధిలో నివాసం ఉంటున్న నాగమురళి జాతీయ రహదారి పక్కన కూల్ డ్రింక్స్ షాపు, టీ కేఫ్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగా గురువారం రాత్రి వ్యాపారం ముగించుకొని షాపు మూసివేసి ఇంటికి వచ్చాడు. గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి రూ. 80వేలు నగదు, రూ.10వేలు విలువ గల సిగరెట్లు, ఓ స్మార్ట్ ఫోన్ చోరీ చేశారు. బాధితుడు శుక్రవారం ఉదయం వెళ్లి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భూముల పరిహారం చెల్లింపుపై సంబరాలు

ఉరవకొండ, జనవరి17(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఇటీవల నష్ట పరిహారం మంజూరు చేసింది. ఇందుకుగాను మండలంలోని రాకెట్ల గ్రామ రైతులు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం గ్రామంలో సంబరాలు ఈ సందర్భంగా ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో పరిహారం మంజూరు చేయకుండా కాలయాపన చేశారన్నారు. అమిద్యాల, రాకెట్ల లిఫ్ట్‌ను ఆ పార్టీ నాయకులు ప్రచారం కోసం వాడుకున్నారే తప్పా ఒక్క రూపాయి పరిహారం ఇప్పించలేకపోయారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ చొరవ తీసుకుని 32మంది రైతులకు రూ.4కోట్లు పరిహారాన్ని ఇప్పించారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిసింద్రీ, నెట్టెం రాము, నరేంద్ర, ఆదెప్ప, క్రాంతి కుమార్, తిప్పయ్య, ఓబయ్య, మురళి పాల్గొన్నారు.



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, టీడీపీ నాయకులు

రైతును మోసం చేసిన వ్యక్తి అరెస్టు

గుత్తి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): చుక్కల భూమి క్రమబద్ధీకరిస్తామని నమ్మబలికి ఓ రైతు నుంచి రూ.6లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో జానా విజయ్‌కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. పెద్దవడూగురు మండలం గుత్తి అనంతపురం గ్రామ సమీపంలో పట్టణానికి చెందిన మైనుద్దీన్‌కు 5ఎకరాల భూమి ఉంది. దానిని చుక్కల భూమి నుంచి క్రమ బద్ధీకరిస్తామని నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన విజయ్‌కుమార్‌తో పాటు అతడి సహచరుడు నమ్మబలికి ఆ రైతు వద్ద రూ. 6లక్షలు తీసుకున్నారు. అయితే ఏళ్లు గడుస్తున్నా ఈ వ్యవహారంపై ఎలాంటి పురోగతి కనిపించకపోడంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని విజయ్‌కుమార్‌ను రైతు అడిగాడు. డబ్బు ఇవ్వకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు ప్రధాన నిందితుడైన విజయ్‌కుమార్‌ను శుక్రవారం అరెస్ట్ చేయగా మరొకరు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. త్వరలో అతన్ని కూడా అరెస్ట్ చేస్తామని అన్నారు.

20 నుంచి పశువైద్య శిబిరాలు

ఉరవకొండ, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ డివిజన్‌లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకూ పశు వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు డీడీ వెంకటేష్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శిబిరాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని పశువైద్యులకు సూచించారు. డీవార్మింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: డీఆర్‌డీఏ పీడీ



కుట్టు మిషన్‌ను పరిశీలిస్తున్న పీడీ ఈశ్వరయ్య

పామిడి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. మండలంలోని ఓబుళాపురం గ్రామంలో శుక్రవారం స్వయం సహాయక సంఘ సభ్యులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సంఘాల నిర్వహణ, జీవనోపాధి, పుస్తక నిర్వహణ, ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్, బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి, కమ్యూనిటీ ఎన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి సభ్యురాలు సుస్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకొని ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్రమతప్పకుండా రుణానికి చెందిన నెలవారీ కంతులను చెల్లించాలన్నారు. అనంతరం మహిళలు జీవనోపాధిగా ఏర్పాటు చేసుకున్న కుట్టుమిషన్‌లను పరిశీలించారు. డీఆర్‌డీఏ డీపీఎం గంగాధర్, ఏపీఎం నల్లప్ప, సీసీ రంగనాయకులు, యానిమేటర్ వెంకటేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గుత్తి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): రైల్వే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని పీడబ్ల్యూఐ కార్యాలయం వద్ద శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే మజ్దూరు యూనియన్ నాయకులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కీమెన్‌కు పని భారం తగ్గించాలని, ట్రాక్ మెయింటైన్స్ ఖాళీలను భర్తీ చేయాలని, మహిళా ట్రాక్ మెయింటర్లను ఇతర డిపార్ట్‌మెంట్‌లకు బదిలీ చేయాలన్న తదితర డిమాండ్లతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఓపెన్‌లైన్ బ్రాంచ్ చైర్మన్ సుధీర్, కార్యదర్శి శేఖర్‌బాబు, మజ్దూర్ యూనియన్ ఏడీఎస్ నారాయణ, నాయకులు గోపాల్, రామకృష్ణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పంటలను నాశనం చేస్తున్న వన్యమృగాలు

● ఆవేదన చెందుతున్న రైతులు
● కాపాడాలంటూ అటవీ అధికారులకు మొర



బసంపల్లిలోని వేరుశనగ పొలంలో జింకల గుంపు



అనుంపల్లిలో అడవి పందుల వల్ల ధ్వంసమైన మొక్కజొన్న పంట

శెట్టూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వన్య మృగాల భారి నుంచి తమ పంటలను కాపాడాలని మండలంలోని పలు గ్రామాల రైతులు అటవీ శాఖా అధికారులను కోరుతున్నారు. లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలను రాత్రివేళల్లో సమీప అడవుల్లోంచి అడవిపందులు, జింకలు, ఎలుగుబంట్లు వచ్చి నాశనం చేస్తున్నాయని వాపోతున్నారు. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు ఇలా నాశనమవుతుంటే.. మా పరిస్థితి ఏమిటంటూ ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా బసంపల్లి, అడవి గొల్లపల్లి, అనుంపల్లి తదితర గ్రామాలలో ఈ పరిస్థితి అధికంగా ఉందంటున్నారు. ఎక్కువగా వేరుశనగ పొలాల్లోకి జింకలు పగటి పూట సైతం గుంపులుగా వచ్చి పంటను నాశనం చేస్తున్నాయంటున్నారు. వన్యమృగాల నుంచి పంటలు కాపాడేందుకు అష్టకష్టాలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు స్పందించి వన్యమృగాల భారి నుంచి తమ పంటలను కాపాడాలని వారు కోరుతున్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం

● దుకాణాల నిర్వాహకులకు మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్ సూచన



దుకాణం నిర్వాహకుడితో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డి

తాడిపత్రి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామంటూ స్థానిక దుకాణాల నిర్వాహకులకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మార్కండేయస్వామి ఆలయం నుంచి సీబీరోడ్డు మీదుగా రామచంద్రలాడ్జి వరకు శుక్రవారం ఆయన నడుచుకుంటూ వెళుతూ.. దుకాణాల నిర్వాహకులతో మాట్లాడారు. ప్రతి దుకాణం వద్ద పరిశుభ్రతగా ఉండాలన్నారు. అలాగే పచ్చదనం నెలకొని ఉండాలన్నారు. వ్యాపారాలు బాగానే ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, గోవర్దన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాగభూషణం తదితరులు ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

గుత్తిరూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈశ్వరపల్లి గ్రామంలో పెద్దన్న అనే రైతుకు చెందిన గడ్డి వామి శుక్రవారం సాయంత్రం అగ్నికి ఆహుతైంది. పెద్దన్న తన పాడి పశువుల కోసం రూ.50 వేలు వెచ్చించి వేరుశనగ గ్రాసాన్ని కొనుగోలు చేసి తన దొడ్డి కల్లంలో వామి వేసి ఉంచాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు బీడి తాగి పడి వేయడంతో గడ్డి వామి పక్కన ఉన్న చెత్తకు నిప్పు అంటుకుంది. అలాగే పక్కనే ఉన్న వామికి మంటలు చేలరేగడంతో గ్రాసం మొత్తం దగ్ధమైంది. స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. కానీ అదుపులోకి రాలేదు. గుంతకల్లులోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది వచ్చేలోగా వామి మొత్తం కాలిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

రాయదుర్గం రూరల్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు మార్చి నెలాఖరిలోగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ శైలజ సూచించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆమె హౌసింగ్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా 5572 మంది లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 3294 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మార్చి నెలాఖరికల్లా పూర్తి చేయాలన్నారు. లేకపోతే నిధులు వెనక్కి వెళతాయని తెలిపారు. అధికారులు అప్రమత్తమై లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ శ్రీమన్నారాయణ, డీఈ రంగస్వామియాదవ్, మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ కొండన్న, ఏఈ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల వెంట పిల్లలను పంపరాదు

● అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు

పామిడి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): అపరిచితుల వెంట పిల్లలను పంపవద్దని అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం పెద్దవడుగూరుకు చెందిన నలుగురు చిన్నారులు తప్పిపోవడంతో గంటలోనే ఆచూకీ తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఈ సంఘటన వివరాలను వెల్లడించారు. పెద్దవడుగూరు ఎస్సీ కాలనీకి చెందిన అంగన్‌వాడీ టీచర్ విజయశ్రీ తన కుమారుడు చిన్న మహమ్మద్ తబ్రేజ్, కుమార్తెలు మమ్మీ, శాన్వితోపాటు అదేకాలనీకి చెందిన చిన్నారులు బాలాజీ, సూరిబాబు, శివరాంతో కలిసి అనంతపురంలోని నేషనల్ పార్కును చూసేందుకు స్కూటీపై బయలుదేరింది. కల్లూరు వద్దకు రాగానే గుత్తి వైపు నుంచి అనంతపురం వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని ఓ కారులో మహమ్మద్ తబ్రేజ్, మమ్మీ, బాలాజీ, సూరిబాబును ఎక్కించి అనంతపురంలో వదలమని స్కూటీలో వెనకాలే బయలుదేరింది. కాగా కారులో ఎక్కిన పిల్లలు అనంతపురంలో కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయంపై వెంటనే గార్లదిన్నె పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషాకు ఫిర్యాదు చేసింది. దీంతో అనంతపురం డీఎస్పీ వెంకటేశ్వర్లు నగరంలో పిల్లల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పామిడి అంబేడ్కర్ కాలనీ వద్ద 44వ జాతీయ రహదారిపై సీఐ యుగంధర్ వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో వెళ్తున్న చిన్నారులను గుర్తించి పామిడి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పిల్లల తల్లిదండ్రులకు సమాచారం చేరవేసి వారికి అప్పగించారు. పిల్లల ఆచూకీకి కృషి చేసిన శింగనమల, పామిడి సీఐలు కౌలుట్లయ్య, యుగంధర్, పామిడి, గార్లదిన్నె ఎస్‌ఐలు రవి ప్రసాద్, గౌస్ మహమ్మద్ బాష, హెడ్ కానిస్టేబుళ్లు ఎంసీ నరసింహులు, ఎం రామాంజనేయులు, కానిస్టేబుళ్లు నాగార్జున, నరేష్, కృష్ణలను ఎస్పీ జగదీష్ అభినందించారు.

విజయవంతం చేయండి

గుత్తి, జనవరి 17(ఆంధ్రజ్యోతి):కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో నిర్వహించనున్నారని, అధికారులు, సిబ్బంది విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల సభ్యులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతినెలా మూడవ శనివారం స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ దివస్‌లో పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే కార్యక్రమం జరుపుతామన్నారు. ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శెట్టూరు: మండలకేంద్రంతోపాటు ప్రతి గ్రామ పంచాయతీలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీవో రఘురామారావు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రాయదుర్గంరూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ కొండన్న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. శనివారం చేపట్టే స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు ఆందోళన

ఉరవకొండ,జనవరి17(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండం కొనకొండ్లలో శుక్రవారం ప్రియుడి ఇంటి ముందర ప్రియురాలు ప్రజా సంఘాలతో కలిసి ఆందోళనకు దిగింది. అదే గ్రామానికి చెందిన ఆమె తనను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని గతేడాది ఓ యువకుడిపై ఫిర్యాదు చేసింది. అప్పట్లో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. శుక్రవారం ఆమె ప్రియుడి ఇంటి ముందు ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపట్టింది. పోలీసులు అక్కడకు చేరుకుని, ప్రియుడు, ప్రియురాలిని, పెద్ద మనుషులను స్టేషన్‌కు పిలిపించి, వివాదం కోర్టులో ఉన్నందున తాము జోక్యం చేసుకోలేమని, సర్దిచెప్పి పంపించారు.

కేరట్ మనదే!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

'కేరో' అనే ఇండో-యూరోపియన్ మూల పదానికి 'కొమ్ము' ఆకారంలో ఉండేదని అర్థం. పసుపుకొమ్ము, శొంఠి కొమ్ము లాగానే 'కేరెట్ కొమ్ము' అని వాడేవారు. చాలామంది ఇది విదేశాల నుంచి మనకు దిగుమతి అయిన దుంప అని భావిస్తారు. వాస్తవానికి ఈ దుంప మన దేశంలో కొన్ని వేల ఏళ్లుగా పండుతోంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలు గుంజన దుంపలు, గాజర గడ్డలనే పేర్లతో కేరట్‌నే పేర్కొన్నాయి. 16వ శతాబ్ది నాటి భోజన కుతూహలం, 17వ శతాబ్ది నాటి హంసవింశతి గ్రంథాలలో ఈ దుంప ప్రస్తావన ఉంది.

మనకు దొరికే గాజర దుంపలు లేత కాషాయ రంగులో ఉంటాయి. ఇవి మిగిలిన రంగుల్లో కూడా మనకు లభ్యమవుతాయి. కేరట్ కాయలను మెరికార్స్ అంటారు. మానవ శరీరంలో నిర్మాణ క్రియలకు సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని సరిచేసే గుణం వీటికుంది. ఇక కేరట్‌లోని బీటాకెరోటీన్ అనే పదార్థంవల్ల ఆ దుంపలకు కాషాయ వర్ణం ఏర్పడుతుంది. సాధారణంగా మొక్కల్లోని కణాలను అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి ఈ బీటాకెరోటిన్ కాపాడుతూ ఉంటుంది. అందువల్లే కేరట్‌ను తింటే బీటాకెరోటిన్ శరీరానికి అందుతుంది. చర్మం నిగనిగలాడుతుంది. అంతేకాకుండా కంటి చూపు మెరుగుపరచటానికి కూడా కేరట్ ఉపకరిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ సైనికులకు కంటి చూపు మెరుగుపరచటం కోసం కేరట్‌ను ఆహారంగా పెట్టేవారట!



కేరట్, ముల్లంగి, కీర... ఈ మూడు దుంపలను సమాన పరిణామాల్లో తీసుకొని జ్యూస్ చేసుకొని రోజూ ఉదయం తాగితే శరీరంలోని అనేక రకాల రోగాలు తగ్గుతాయి. దీనిలో కొద్దిగా పెరుగు కలిపినా మంచిదే.

'భోజన కుతూహలం' గ్రంథం ప్రకారం కేరట్ వల్ల కలిగే ప్రయోజనాలివి...

- కేరట్‌లు కఫ దోషాలను పోగొడతాయి. కడుపు ఉబ్బరాన్ని, ఆమ్లాలను తగ్గిస్తాయి.
- నులిపురుగులను అరికడతాయి. కడుపునొప్పి వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తాయి.
- శరీరంలో వేడి తగ్గుతుంది. చలవ చేస్తుంది. దప్పిక కూడా తగ్గుతుంది.
- స్త్రీలలో రక్తస్రావాన్ని అరికట్టడానికి ఇవి ఉపకరిస్తాయి
- అమీబియాసిస్ వ్యాధి ఉన్నవారికి కేరట్‌వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ...
ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని...
అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో
తయారుచేసిన పచ్చళ్లనే తినమని
డాక్టర్లు సూచిస్తూ ఉంటారు.
అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ...
మీ కోసం.



వంటిల్లు

తాజా తాజా చట్నీలు

మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

కావాల్సిన పదార్థాలు:

ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం- అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అర చెంచా, టమోటా ముక్కలు- ఒక కప్పు, కేరట్- అర కప్పు, బీన్స్- పావు కప్పు, కాలీఫ్లవర్- అర కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, చింతపండు రసం- రెండు చెంచాలు, పంచదార- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, జీలకర్ర- ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత

తయారీ విధానం:



- కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
- ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
- కూర ముక్కల్లోని నీళ్లు ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
- ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
- వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

జాగ్రత్తలు:

- పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
- ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

ముల్లంగి ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

తరిగిన కొత్తిమీర- అర కప్పు, ముల్లంగి ఆకులు- అర కప్పు, ముల్లంగి ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, నిమ్మకాయ రసం- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం:

- మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.

జాగ్రత్తలు:

- కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
- నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

చేమ ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

సన్నగా తరిగిన చేమ ఆకులు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు స్పూన్లు, చింతపండు రసం- రెండు చెంచాలు, బెల్లం పొడి- రుచికి తగినంత, కొబ్బరి తురుము- నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
- ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
- మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.

జాగ్రత్తలు:

- లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకు కూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.
- బెల్లం బదులు పంచదార కూడా వేసుకోవచ్చు

దుస్తులపై మరకలా... వదిలించండిలా...

ఒక్కోసారి బట్టలపై అనుకోనివిధంగా మరకలు పడుతుంటాయి. సబ్బుతో ఉతికినా, వాషింగ్ మెషిన్‌లో వేసినా అవి పోవు. కొన్ని చిట్కాలు పాటించి మొండి మరకలను సైతం సులువుగా పోగొట్టుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!


- బట్టలపై సిరా మరకలు పడితే వాటి మీద కొద్దిగా శానిటైజర్ లేదా పెర్ఫ్యూమ్ చల్లి దూదితో రుద్దాలి. ఒక చెంచా బేకింగ్ సోడాని నీళ్లతో తడిపి ముద్దలా చేసి ఈ మిశ్రమంతో రుద్దినా సిరా మరకలు వెంటనే పోతాయి. మరక మీద కొద్దిగా డెటాల్ వేసి అయిదు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత టూత్ బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది.
- బట్టల మీద టీ లేదా కాఫీ ఒలికి మరకలు పడుతుంటాయి. అలాంటపుడు ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మరకమీద రుద్దితే ఫలితం ఉంటుంది. మరక మీద టూత్ పేస్ట్ రాసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో కడిగి సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- పార్కులో కూర్చున్నపుడు లేదా తోటపనిచేసినపుడు బట్టల మీద మరకలు ఏర్పడుతుంటాయి. అర బకెట్ నీళ్లలో అయిదు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపండి. ఈ నీళ్లలో బట్టలను గంటసేపు నానబెట్టి తరవాత సబ్బుతో ఉతికితే మరకలన్నీ పోతాయి. టమాటా, తుప్పు, జ్యూస్, రక్తం మరకలను కూడా ఈవిధంగానే పోగొట్టవచ్చు.
- చాక్లెట్ మరకలైనపుడు ఆ బట్టలను.... బట్టల సోడా కలిపిన నీళ్లలో అరగంటసేపు నానబెట్టి సబ్బుతో ఉతికితే చాలు.
- బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసినపుడు కొన్నిటి రంగులు మిగతా వాటికి అంటుకుంటుంటాయి. సబ్బుతో రుద్దినా ఆ మరకలు పోవు. వాటి మీద 90 శాతం ఆల్కహాల్ ఉన్న ద్రావణాన్ని చల్లి దూదితో రుద్దితే రంగుల మరకలు పోతాయి.
- రక్తం మరకలు పడినపుడు వాటి మీద హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం చల్లి అరగంటసేపు ఉంచాలి. తరవాత సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- నూనె మరకలు పడినపుడు వాటి మీద డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా బేకింగ్ సోడా చల్లి అరగంట తరవాత టూత్‌బ్రష్‌తో రుద్దితే చాలు.
- బకెట్ వేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్, కొద్దిగా బట్టల సోడా వేసి బాగా కలిపి అందులో బట్టలను నానబెట్టాలి. అరగంట తరవాత వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరవేస్తే తెలికపాటి మరకలన్నీ పోతాయి.



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి

పురాణ పరిజ్ఞానంలోనూ అన్నగారు మిన్న!



'ధన, రుణ సమ్మిళితం శక్తి-తత్ఫలితం సృష్టి' అన్నది అనాదిగా జగమెరిగిన సత్యం! పాజిటివ్, నెగిటివ్ అన్నవి లేకుంటే పవర్ లేదన్న విషయం సైన్స్ కూడా ధ్రువీకరిస్తోంది. దీనిని అనుసరించే కళలు కాంతులీనాయని ప్రతీతి. రచనలోనూ ఈ విషయాన్నే స్మరిస్తూ ఓ కథలోని ప్రధాన పాత్రల్లోని తప్పొప్పులను విశదీకరిస్తూ సాగారు. వేద వ్యాస భగవానుడు కూడా అదే తీరున పంచమ వేదం మహాభారతాన్ని రచించారు. యూదు, క్రైస్తవ, ఇస్లామ్ మతస్థులు పవిత్రంగా భావించే మోజెస్ రచనలు సైతం ఇదే పంథాను అనుసరించాయని చెప్పవచ్చు. ఇవన్నీ తెలుగు చిత్రసీమలో పౌరాణికాలతో కళాఖండాలు తెరకెక్కించిన వారికి తెలియనివి కావు. అలాగే ప్రపంచంలోనే అత్యధిక పౌరాణిక చిత్రాల్లో నటించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుకు కూడా ఆ పురాణపరిజ్ఞానం ఉందనే విషయాన్ని ఆయన తెరకెక్కించిన పురాణగాథలు చెప్పకనే చెబుతాయి.

● ఈ మధ్య ఎన్టీఆర్ పుట్టిన గడ్డపైనే నిల్చుని అనంతమైన అవివేకం ప్రదర్శిస్తూ కర్ణుని పాత్రను గొప్పగా చిత్రీకరించడం తప్పు అని ఇంకా ఏవేవో చెప్పారు. 'దానవీరశూర కర్ణ'లో కర్ణుడిని గొప్పగా చూపించడం వల్లే తరువాతి తరాల వారు కర్ణ పాత్రను ఎంతో ఉదాత్తంగా భావిస్తున్నారని వారి భావన! నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు కూడా ఎంతోమంది కర్ణుని గొప్పతనం గురించి పౌరాణిక చిత్రాల్లో ప్రస్తావించినవారున్నారు. ఘోష యాత్ర సమయంలోనూ, గోగ్రహణ సమయాన కర్ణుడు పరాజితుడైన మాట వాస్తవమే! అయితే అదే కర్ణుడిపై దుర్యోధనునికి ఎందుకంత నమ్మకం అంటే అస్త్రశస్త్ర రచనలోనూ, గదాయుద్ధంలోనూ ప్రావీణ్యం ఉన్న జరాసంధుని సైతం కర్ణుడు నిలువరించి ఉంటాడు. అందువల్ల దుర్యోధనునికి కర్ణుడంటే అంతటి విశ్వాసం! ఇక తన ప్రాణరక్షితాలైన సహజ కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చిన సమయంలోనే బలి, శిబి, దధీచి వంటి పుణ్యాత్ముల సరసన చేరాడు కర్ణుడు. ఇవన్నీ కాదు సాక్షాత్తు వేదవ్యాసుడే కర్ణుని గొప్పతనాన్ని వివరిస్తూ 'మహాతేజస్వి, అభిమానవంతుడు, ధార్మికోత్తముడు..' అంటూ (మహాభారతం-ఉద్యోగపర్వం 144-31)లో వర్ణించాడు. ఇలాంటి అంశాలన్నీ నటరత్న ఎన్టీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన పాత్రలోని మంచిచెడ్డలలో మంచినే ఎక్కువగా ప్రదర్శించాలన్న సంప్రదాయాన్ని అనుసరించారు ఎన్టీఆర్. ఆయనే కాదు తరవాత వెలసిన పురాణాల లక్ష్యం కూడా అదే! ఆ అష్టాదశ పురాణాలను సైతం 'మహాభారత' కర్త వేదవ్యాసులవారే అందించారు.

● అదే తీరున రామాయణ, భారత, భాగవతాలను అందులోని పాత్రలను ఆశ్రయించుకొని తరువాతి రోజుల్లో పలు రచనలు వచ్చాయి. ఇక తెలుగులో కవిత్రయం మూలభారతంలోని కొన్ని అంశాలను వదిలివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తీరున ఎవరికి వారు తమ స్వేచ్ఛాసృష్టితో ఆ పురాణ పాత్రలకు తమదైన రీతిలో హంగులు అద్దారు. అలా వెలసిన కథనే మనమంతా మహా కళా ఖండమని కీర్తిస్తున్న 'మాయాబజార్'(1957) చిత్ర రాజం!

● తొలి నుంచీ మన పురాణాల లక్ష్యం సామాన్యులలో సత్ప్రవర్తన కలుగజేయడమే! ఎన్టీఆర్ సైతం దానిని అనుసరించారు. తాను తొలిసారి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కించిన 'సీతారామకళ్యాణం'లో రావణ పాత్రను అదే తీరున చిత్రీకరించారు. పరమశివభక్తుడైన రావణుడు స్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడని చాటారు. ఎన్నో సున్నితాంశాలను సైతం నిశితంగా చాటిన ఎన్టీఆర్ పురాణ పరిజ్ఞానాన్ని శంకించడం అనంతమైన అజ్ఞానమే అవుతుంది. 'లవకుశ' చిత్రం ఘనవిజయం తరువాత ఆ సినిమా వెలుగు చూడటానికి కారకులైన సుందర్‌లాల్ నహతా ఎన్టీఆర్‌ను ఓ కోరిక కోరారు. హిందీలో తాను తీసే సినిమాలో శ్రీకృష్ణ పాత్ర ధరిస్తే కోటి రూపాయలు పారితోషికంగా సమర్పించుకుంటానని అన్నారు నహతా. అయినా ఎన్టీఆర్ తన పౌరాణిక పాత్రలు తెలుగు వారికే సొంతం కావాలని ఆశించి, నహతా ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. తన తెలుగు జాతి అంటే ఎన్టీఆర్‌కు అంతటి అభిమానం! అలాగే తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసి సృష్టించిన చరిత్ర తెలిసిందే. ప్రజల మదిలో ఆయన నేటికీ కొలువై ఉండడానికి ఆయన పోషించిన పౌరాణిక పాత్రలు, వాటిలో చూపించిన వైవిధ్యం కారణమని చెప్పక తప్పదు. భారతీయులు పవిత్రంగా భావించే దేవతామూర్తుల పాత్రల్లో ఎన్టీఆర్ నటించలేదు, జీవించారు. అందువల్లే ఈ నాటికీ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ జీవించే ఉన్నారు. అంతటి మహానటుణ్ణి, మహానాయకుణ్ణి కొందరు స్వార్థపరులు రాజకీయం కోసం వేలెత్తి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాదిన ఓ మహా స్వాప్నికుడిని హిందువు కాదంటూ ఛిద్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే తీరున ఎన్టీఆర్ పేరును కూడా తమ పాలిటిక్స్‌కు ఉపయోగించుకోవాలనుకుంటే ఇక్కడ అటువంటివారి పప్పులు ఉడకవు. ఎందుకంటే తెలుగు నేలతో మమేకమైన - తెలుగు జనతతో పెనవేసుకున్న ఎన్టీఆర్ అనుబంధం అంతటి గాఢమైనది.

- కొమ్మినేని వెంకటేశ్వర రావు

నా రికార్డ్స్ అన్నీ అన్‌స్టాపబుల్

-నందమూరి బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో విజయోత్సవ సభను చిత్ర బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'వరుసగా ఇది నాకు నాలుగో విజయం. నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా డాకు మహారాజ్. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో ప్రేమించి, నాలో ఉన్న నట విశ్వరూపాన్ని ఆవిష్కరించేలా చేశాడు దర్శకుడు బాబీ. అలాగే మా నిర్మాత వంశీ గారు నా అభిమాని. ఈ సినిమాలో కొత్త బాలకృష్ణను ఆవిష్కరించాలని ఆయన కల కన్నారు. అన్ని క్రాఫ్ట్ మీద మంచి గ్రిప్ ఉన్న వంశీ.. నా అభిమాని కావడం నాకు చాలా గర్వంగా ఉంది. మన సినిమాలను చూసి ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. నా వరకు చూసుకుంటే, నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్' అన్నారు. ఈ నెల 22న అనంతపురంలో విజయోత్సవ పండుగ నిర్వహిస్తామని బాలకృష్ణ చెప్పారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ,' బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో ఒక మాస్టర్ పీస్ సినిమా ఇవ్వడానికి కారణమైన మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్. బాలకృష్ణ గారు కథను అర్థం చేసుకొని, దర్శకుడు ఏది అడిగితే అది చేస్తారు' అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాము. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. జనవరి 12న ఈ సినిమా విడుదలైతే, సంక్రాంతి పండుగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్.' అన్నారు.

మహేశ్ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది

- వెంకటేశ్



'కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయం కాదు, తెలుగు ప్రేక్షకులది. ఈ సినిమాను ఇంతటి సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా' అని అన్నారు హీరో వెంకటేశ్. 'సంక్రాంతికి వస్తున్నాం' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పొంగల్ బ్లాక్‌బస్టర్ జాతర సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలోని అనేక మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమా చాలా నచ్చిందంటూ చిన్నోడు మహేశ్‌బాబు ట్వీట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ రోజు నాకు ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు. ప్రేక్షకుల సపోర్ట్ లేకుంటే నాకు ఏ విజయమూ దక్కేది కాదు. ఒక దర్శకుడిగా ప్రేక్షకులకు ఎంతగా రుణపడి ఉండాలో అర్థం కావడం లేదు' అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా మేము ఊహించని మహా అద్భుతం. అనిల్, వెంకటేశ్ కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్. ఈ సంక్రాంతిని మర్చిపోలేం' అని అన్నారు. మరో నిర్మాత శిరీష్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఆర్ట్స్ హరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ చిత్రం మా సమస్యలన్నింటినీ తీరుస్తుందని షూటింగ్‌లో చెప్పేవారు. ఆయన మాట నిజమైంది' అని అన్నారు.

పెద్దోడిని అభినందించిన చిన్నోడు

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సెలబ్రేషన్స్‌కు మహేశ్ హాజరై సందడి చేశారు. వెంకటేశ్‌తో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఖేల్‌రత్న పురస్కారాలు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, గుకేశ్

కనుల పండుగ.. క్రీడా అవార్డుల వేడుక

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ చాంపియన్ గుకేశ్‌లతో పాటు హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ విజేత ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. వీరికి సర్టిఫికెట్, మెడల్‌తో పాటు తలా రూ.25 లక్షల రివార్డు దక్కుతుంది. అలాగే 32 మంది అథ్లెట్లు అర్జున అవార్డును అందుకోగా, ఐదుగురు ద్రోణాచార్య స్వీకరించారు. తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జివాంజితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజిలకు అర్జున దక్కింది. దీప్తి అవార్డును స్వీకరించగా, జ్యోతి శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ పురస్కారంతో పాటు రూ.15 లక్షల రివార్డు వీళ్లకు దక్కనుంది.

భావోద్వేగ సన్నివేశం..

అర్జున అవార్డు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటానికి ఫలితం దక్కింది. పారాలింపిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన 80 ఏళ్ల మురళీకాంత్ పేట్కర్ చివరకు అర్జున అవార్డు (లైఫ్ టైమ్) అందుకున్నాడు. అయితే ఈ సందర్భంలో అంతటా భావోద్వేగం చోటుచేసుకుంది. 1965లో పాకిస్థాన్‌తో యుద్ధంలో పేట్కర్‌కు బుల్లెట్



గాయం తగిలి నడుం కింది భాగానికి వైకల్యం ఏర్పడింది. ఆ తర్వాత 1972 పారాలింపిక్స్ స్విమ్మింగ్‌లో అతను స్వర్ణం సాధించాడు. ఆహూతుల హర్షధ్వానాల మధ్య అతను చేతి కర్రల సహాయంతో అవార్డును స్వీకరించేందుకు రాగా, రాష్ట్రపతి ముందుకు వచ్చి పేట్కర్‌ను సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది.

షూటర్ ముకేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మొహాలీలో జరిగిన అఖిల భారత విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ ముకేష్ రజతంతో మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ముకేష్ రెండో స్థానంలో నిలిచాడు.

చెస్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో జాతీయస్థాయి పాఠశాల చెస్ చాంపియన్‌షిప్ శుక్రవారం ఘనంగా మొదలైంది. టోర్నీని స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈనెల 21 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా ఎంపిక నేడే

ముంబై: చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టును శనివారం ప్రకటించనున్నారు. 15 మందితో కూడిన ఈ ప్రాథమిక జట్టులో సెలెక్షన్ కమిటీ బుమ్రాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆసీస్‌తో చివరి టెస్టులో తను గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించనున్నారు.

స్టార్లు సాఫీగా..


సబలెంకా

- ప్రీక్వార్టర్స్‌లో జొకో, అల్కారజ్, సబలెంకా, గాఫ్
- ఏడో సీడ్ పెగులాకు షాక్
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకొంటూ ముందంజ వేస్తున్నారు. పురుషుల్లో..11వ టైటిల్‌పై కన్నేసిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్, నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంకా, మూడో సీడ్ కొకొ గాఫ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. అయితే మెల్‌బోర్న్ పార్క్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన నవోమి ఒసాకా గాయంతో మూడో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. ఏడో సీడ్ జెస్సికా పెగులాకు అన్‌సీడెడ్ సెర్బియా క్రీడాకారిణి ఓల్గా డానిలోవిచ్ షాకిచ్చింది. గత ఏడాది సెమీఫైనలిస్ట్ గాఫ్ 6-4, 6-2తో 2021 యూఎస్ ఓపెన్ రన్నరప్ లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తు చేసింది. టాప్ సీడ్ సబలెంకా కూడా 7-6 (5), 6-4తో క్లారా టాసన్‌పై గెలిచింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌లలో 11వ సీడ్ పౌలా బడోసా 6-4, 4-6, 6-3తో 17వ సీడ్ కోస్ట్యుక్‌ని, 14వ సీడ్ ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్‌ని, 27వ సీడ్ పల్యుచెన్కోవా 6-1, 6-2తో సీగ్మండ్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. 23 ఏళ్ల ఓల్గా డానిలోవిచ్ 7-6 (3), 6-1తో ఏడో సీడ్, యూఎస్ ఓపెన్ రన్నరప్ పెగులాపై సంచలన విజయం సాధించింది. 12వ సీడ్ ష్నీడర్‌కు 7-6 (4), 6-7 (7), 7-5తో 18వ సీడ్ వెకిక్ షాకిచ్చింది. మరోవైపు నవోమి ఒసాకా 6-7 (7)తో టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ బెలిండా బెన్సిక్‌తో తొలి సెట్‌ను కోల్పోయిన దశలో పొత్తి కడుపు నొప్పితో మ్యాచ్ నుంచి నిష్క్రమించింది. పురుషుల మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో టోమస్ మకాక్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. అయితే రెండో సెట్‌లో జొకో శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. ఆ పై చికిత్స తీసుకొని మ్యాచ్‌ను కొనసాగించాడు. రెండో సీడ్ జ్వెరేవ్ 6-3, 6-4, 6-4తో పెర్సెల్‌పై, మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-7 (7), 6-2తో బోర్గెస్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 7-6 (0), 6-2, 6-0తో కార్బలెస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

మిక్స్‌డ్‌లో బోపన్న జోడీ బోణీ

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత వెటరన్ రోహన్ బోపన్న మిక్స్‌డ్‌లో బోణీ చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న/షుయ్ జాంగ్ (చైనా) ద్వయం 6-4, 6-4తో డోడిగ్/క్రిస్టియానాపై నెగ్గి రెండోరౌండ్ చేరింది.

అమ్మాయిలూ.. అదరగొట్టాలి

- డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్
- తొలి రోజే ఆరు మ్యాచ్‌లు
- రేపు విండీస్‌తో యువ భారత్ పోరు

నేటి నుంచి అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

ఉదయం 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



కౌలాలంపూర్: భారత కొత్తతరం మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా నిరూపించుకోవాలనుకుంటున్నారు. శనివారం నుంచి మలేసియాలో అండర్-19 టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కాబోతోంది. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి మెగా టోర్నీలో షఫాలీ వర్మ నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి నికీ ప్రసాద్ కెప్టెన్సీలో టీమ్ చెలరేగి రెండో టీ20 వరల్డ్‌కప్‌ను సైతం ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటుండగా, వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్ దశకు వెళతాయి. ఆ తర్వాత రెండు సూపర్ సిక్స్ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది. ఇక భారత జట్టు గ్రూప్ 'ఎ'లో ఉండగా శ్రీలంక, వెస్టిండీస్, మలేసియా ఇతర జట్లు. ఆదివారం విండీస్‌తో జరిగే పోరుతో భారత్ తమ టైటిల్ వేట ఆరంభిస్తుంది. అయితే శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆసీస్-స్కాట్లాండ్, ఇంగ్లండ్-ఐర్లాండ్, సమోవా-నైజీరియా, బంగ్లాదేశ్-నేపాల్, పాకిస్థాన్-యూఎస్ఏ, న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా జట్లు తలపడతాయి.

భారత్ షెడ్యూల్

జనవరి 19	వెస్టిండీస్‌తో
జనవరి 21	మలేసియాతో
జనవరి 23	శ్రీలంకతో

మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 12 గం. నుంచి

త్రిష మరోసారి..



గత నెలలో జరిగిన అండర్-19 ఆసియాకప్‌లో హైదరాబాదీ జి.త్రిష విశేషంగా రాణించింది. దీంతో ఆమె వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో చోటు దక్కించుకుంది. టాపార్డర్‌లో త్రిష దూకుడు జట్టుకు ఉపయోగపడగలదు. అలాగే స్పిన్ విభాగంలో పరునిక సిసోడియా, సోనమ్ యాదవ్, ఆయుషి శుక్లా కీలకం కానున్నారు. జట్టులో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు కేసరి ధ్రుతి, షబ్నమ్‌లకు కూడా చోటు దక్కడం విశేషం.

భారత మహిళల జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాల్కే, త్రిష, కమలిని, భవిక, ఈశ్వరి, మిథిల, జోషితా, సోనమ్ యాదవ్, పరునిక, కేసరి ధ్రుతి, ఆయుషి, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

సింధుకు చుక్కెదురు

- సెమీస్‌కు సాత్విక్ జోడీ
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో మాజీ చాంపియన్ సింధు 9-21, 21-19, 17-21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 2017లో ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధు.. ఆ మరుసటి ఏడాది రన్నరప్‌గా నిలిచింది. కాగా, పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక ఆటగాడు కిరణ్ జార్జ్ 13-21, 19-21తో చైనా షట్లర్ వెంగ్ హంగ్‌యాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/ చిరాగ్ ద్వయం 21-10, 21-17తో కొరియా జోడీ కాంగ్ మిన్ హ్యూక్/హో జిన్‌ను చిత్తుచేసి సెమీస్ చేరింది. ఫైనల్ బెర్త్ కోసం మలేసియా జంట గో జె ఫె/ఇజుద్దీన్ కాన్‌తో సాత్విక్ ద్వయం తలపడనుంది.



సీఎం చంద్రబాబును కలిసిన హంపి


అమరావతి (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ సాధించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా హంపిని చంద్రబాబు అభినందించారు. తెలుగు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన హంపి.. భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు గెలవాలని సీఎం ఆకాంక్షించారు. హంపి వెంట ఆమె కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.

విజయ్ హజారే టోర్నీ ఫైనల్ నేడు | కర్ణాటక X విదర్భ | మ. 1.30 నుంచి

'ఆటో' పెట్టుబడుల కేంద్రంగా భారత్

నాలుగేళ్లలో వాహన రంగంలోకి రూ.3.09 లక్షల కోట్ల ఎఫ్‌డీఐ

ఏడాదిలో 2.5 కోట్ల వాహనాల విక్రయం.. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రధాని



న్యూఢిల్లీ: మొబిలిటీ రంగం భవిష్యత్తు భారత్‌దేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో గత ఏడాది రికార్డు స్థాయిలో రెండున్నర కోట్ల వాహనాలు అమ్ముడుపోయాయని, అనేక దేశాల జనాభా కన్నా మన దేశంలో కార్ల అమ్మకాలు అధికమని చెప్పారు. కేవలం నాలుగేళ్ల కాలంలో మొబిలిటీ రంగంలోకి 3,600 కోట్ల డాలర్ల (రూ.3.09 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మొబిలిటీ (ఆటోమొబైల్) రంగంలో తన భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్‌కు భారత్ అద్భుతమైన గమ్యమన్నారు. ఆటోమోటివ్ పరిశ్రమకు ఇన్నోవేషన్, టెక్నాలజీలే చోదకమని పేర్కొంటూ "ప్రపంచం కోసం దేశంలో తయారుచేయండి" అనే మంత్రంతో ముందడుగేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి మద్దతు, ప్రోత్సాహం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "మేక్ ఇన్ ఇండియా" మంత్రం ఆటోమొబైల్ రంగం వృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎల్ఐ పథకాలు ఈ ప్రచారానికి కొత్త ఉత్తేజం కల్పించడంతో పాటు రూ.2.25 లక్షల కోట్ల విక్రయాలు, 1.5 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలకు బాటవేశాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ, మూడో పెద్ద ప్రయాణికుల వాహన మార్కెట్‌గా ఉందన్నారు. అధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి జీవులు, వేగవంతమైన నగరీకరణ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, అందుబాటులోకి వస్తున్న అఫర్డబుల్ వాహనాలు మొబిలిటీ మార్కెట్‌కు బలమని ఆయన అన్నారు.

వేగంగా విస్తరిస్తున్న ఈవీ మార్కెట్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని చెప్పారు. గత దశాబ్ది కాలంలో ఈవీ విక్రయాలు 640 రెట్లు పెరిగాయన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి 2,600 ఈవీలు అమ్ముడుపోగా గత ఏడాది ఆ సంఖ్య 16.8 లక్షలకు చేరిందన్నారు. ఈ దశాబ్ది చివరి నాటికి ఈ సంఖ్య 8 రెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.

రతన్ టాటా, ఒసాము సుజుకీలకు నివాళి

ఆటోమొబైల్ దిగ్గజాలైన రతన్ టాటా, ఒసాము సుజుకీలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత ఆటోమొబైల్ వృద్ధికి, మధ్య తరగతి ప్రజల కలల సాకారానికి వారిద్దరి సేవలు చిరస్మరణీయమన్నారు. మొత్తం భారత మొబిలిటీ రంగానికి వారిద్దరి వారసత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందని నివాళి ఘటించారు.

మెర్సిడెస్ బెంజ్ రెండు కొత్త కార్లు



మెర్సిడెస్ బెంజ్ సరికొత్త బ్యాటరీ విద్యుత్ కారు (బీఈవీ) ఈక్యూఎస్ మేబాక్ ఎస్‌యూవీ 680 "నైట్ సీరీస్"ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.63 కోట్లు. దీనితో పాటు మెర్సిడెస్ మేబాక్ జీఎల్ఎస్ 600 నైట్ సీరీస్ కారు కూడా విడుదల చేసింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.71 కోట్లు. ఇవి కాకుండా కొత్తగా డెవలప్ చేసిన కాన్సెప్ట్ సీఎల్ఏ కారును ఆవిష్కరించింది.



జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సైబర్‌స్టర్

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ రెండు కొత్త ఈవీ మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఎంజీ సైబర్‌స్టర్ కారు దేశంలోని తొలి ఆల్ ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ కారు. రెండోది ఎంజీ ఎం9. ఇది మూడు వరుసలున్న తొలి విద్యుత్ లిమోసిన్ కారు. ఈ రెండు కార్లను ఈ ఏడాదే మార్కెట్లో విడుదల చేస్తారు. ఈ కార్లతో తాము యాక్సెసిబుల్ లగ్జరీ విభాగంలోకి ప్రవేశించినట్టు కంపెనీ ప్రకటించింది.

బీఎండబ్ల్యూ ఇండియా ఈవీ



జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ పూర్తిగా స్థానికంగా తయారు చేసిన బీఎండబ్ల్యూ ఎక్స్ 1 లాంగ్ వీల్ బేస్ ఈవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.49 లక్షలు. దీన్ని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. బీఎండబ్ల్యూ నుంచి పూర్తిగా దేశీయంగా తయారైన తొలి ఈవీ ఇది.



పోర్షే కొత్త విద్యుత్ ఎస్‌యూవీ

జర్మనీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్షే సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ మకాన్, సరికొత్త హంగులతో తీర్చిదిద్దిన స్పోర్ట్ సెల్యూన్ టైకాన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మకాన్ బీఈవీ మూడు మోడళ్లలో అందుబాటులో ఉంటుంది. ధర రూ.1.22 కోట్ల నుంచి రూ.1.69 కోట్ల మధ్యన ఉంటుంది. కొత్త హంగులతో విడుదల చేసిన టైకాన్ ధర రూ.1.89 కోట్ల నుంచి రూ.2.53 కోట్ల మధ్యన ఉంటుంది.

సుజుకీ తొలి విద్యుత్ స్కూటర్



సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విద్యుత్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను, మరో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఈ యాక్సెస్ 3.07 కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇతర మోడళ్లలో జిక్సర్ ఎస్ఎఫ్ ఫ్లెక్స్ ఫ్యుయెల్ బైక్, పూర్తిగా కొత్తగా తయారుచేసిన యాక్సెస్ 125 సీసీ స్కూటర్ ఉన్నాయి.



హీరో మోటోకార్ప్

టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త వాహనాలను ప్రదర్శించింది. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ ద్వారా 250 సీసీ వాహనాల విభాగంలోకి తొలిసారిగా ప్రవేశించింది. అలాగే ఎక్స్‌పల్స్ 210 బైక్, జూమ్ 125, జూమ్ 160 స్కూటర్లు కూడా ప్రదర్శించిన వాహనాల్లో ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి వాహనాల డెలివరీ ప్రారంభిస్తారు.

బిజినెస్

విప్రో లాభంలో 24 శాతం వృద్ధి

క్యూ3లో రూ.3,354 కోట్లుగా నమోదు

ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24.4 శాతం వృద్ధితో రూ.3,354 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి కంపెనీ ఆదాయం కేవలం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లుగా నమోదైంది. ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం(క్యూ4)లో ఐటీ సేవల ద్వారా సమకూరే ఆదాయం 260.2-265.5 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే క్యూ4లో ఐటీ సేవల ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని అంచనా. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరు కు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.

12,000 నియామకాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000-12,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు విప్రో వెల్లడించింది. కాగా డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,157 తగ్గి 2,32,732కు పరిమితమైంది.

కస్టమర్లకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్‌నే ఉపయోగించండి

బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలను నిరోధించేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు లావాదేవీల విషయమై ఖాతాదారులకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్ నంబర్లను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. అలాగే, ప్రచార అవసరాల కోసం '140XX' సిరీస్ నంబర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించింది. అంతేకాదు, బ్యాంకులు, ఇతర నియంత్రిత సంస్థలు తమ కస్టమర్ల డేటాబేస్‌ను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తుండాలని సూచించింది. మార్చి31 నాటికి ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

అకౌంట్లు, లాకర్లకు నామినీలుండాల్సిందే: మరణించిన ఖాతాదారు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు అన్ని ఖాతాలు, లాకర్లకు నామినీ వివరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. ప్రస్తుత, కొత్త డిపాజిట్ అకౌంట్లు, సేఫ్టీ లాకర్లకు నామినీలను నిర్ధారించాలని కోరింది.

మారుతి ఈ-విటారా



దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. ఈ కారు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేసి 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మోడల్‌కు భారత్‌ను ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా చేయాలనుకుంటున్నట్టు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గరిష్ఠ స్థాయి ముడిచమురు ధరలు సైతం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 780 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, మళ్లీ కాస్త కోలుకుంది. చివరికి సూచీ 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.60 పాయింట్లు కోల్పోయి 23,203.20 వద్ద క్లోజైంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	131
వరంగల్	112	గుంటూరు	130
కరీంనగర్	112	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	127	అనంతపురం	109
గోదావరి	131		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ			
హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	503	విశాఖపట్నం	500
		దజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,270 ▲	74,500 ▲	1,04,000 ▲
విజయవాడ	81,820 ▲	77,000 ▲	93,500 ▲
విశాఖపట్నం	79,290 ▲	72,680 ▲	91,760 ▼
రాజమండ్రి	84,270 ▲	74,500 ▲	91,700 ▲
ప్రొద్దుటూరు	80,350 ▲	74,400 ▲	93,500 ▼
ముంబై	79,239 ▲	72,583 ▲	90,820 ▼

Printed and published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and published at "Aamoda Press" at Sy.No.239-2A, Bypass Road, Ananthapuramu -515 001, Cell No.9985411151, Editor: N.Rahul Kumar.
RNI No: APTEL/2003/10031 Managing Director : Vemuri Radha Krishna Founder : K.L.N.Prasad